## పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణ


డ్రైనేజిని పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడలో గురువారం డ్రైనేజి నిర్వ హణ పనులను చైర్మన్ కొండల్ రెడ్డి పర్య వేక్షించారు. మున్సిపల్‌లో పారి శుద్ధ్య నిర్వ హణలో భాగంగా పలు వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా ఉందా లేదాయని చైర్మన్ మున్సిపల్ కమిషనర్ పి.వేమన రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. డ్రైనేజీ కాలువల్లో చెత్త పేరుకు పోకుండా ఎప్పటికప్పుడు సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్. రెడ్యానాయక్, ఏఈ. నరేశ్, బీఆర్ఎస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

# వార్త

## ఫార్మా సీటి రద్దు ప్రకటన హర్షణీయం : మాజీ ఎంపిపి

**యాచారం డిసెంబరు14,ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి యాచారం ,కందూకురు ,కడ్తాల మండల ప్రజలు ఎప్పటికి రుణపడి ఉంటారని యాచారం మాజీ ఎంపిపి రాచర్ల వేంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం యాచారం మండలం కేంద్రంలో వేంకటేశ్వర్లు మాట్లాడుతూ...ప్రజా సంక్షేమ కోరుతూ రైతుల పక్షాన నిలబడి కాలుష్య నియంత్రణ కోసం ఫార్మా సిటీ రద్దు ప్రకటన హర్షణీయమని కృత జ్ఞతలు తెలిపారు.బావి తరాలకు శాపంగా మారే కంపెనీలను రదునద చేయడం వ్యవసాయం లేదా కాలుష్య రహిత కంపెనీలను ఏర్పాటు చేయాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిరుపేదల సంక్షేమం కోసమే కృషి చేస్తున్నారని గుర్తు చేశారు.ఇబ్రహీంపట్నం నియోజకవర్గం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో సమగ్ర అభివృద్ధి జరుగుతుందని అన్నారు.ఈ ప్రాంత ప్రజలు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఏళ్ల కాలం రుణ పడి ఉంటారని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్మసి రద్దు చేస్తున్న కూడా స్థానిక మాజీ ఎమ్మెల్యే ఫార్మాసీటి కొనసాగుతుందని నేడు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని చెప్పడం బాధాకరమన్నారు.పర్యావరణానికి హాని కలిగించే ఫార్మసిటీ రద్దు భారతదేశ తెలంగాణ ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు అన్నారు.

## జిల్లా కలెక్టర్ హెచ్చరిక

**ఆదిభట్ల డిసెంబరు14,ప్రభాతవార్త :** రాష్ట్రంలోనే ప్రభుత్వ భూములను అన్యక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హోళీకేరి తెలిపారు.కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో జరిగిన సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖాళీగా ఉన్న స్థలాలలో జోవో నెంబరు 59 క్రింద క్రమబద్ధీకరిస్తున్నట్టు కబ్జాలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు.తప్పు చేసినట్లు తెలిస్తే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భారతీ హోళీకేరి హెచ్చరించారు.

## ఫార్మాసిటీ తరలింపు నిర్ణయం హర్షించదగ్గ పరిణామం

### ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**యాచారం డిసెంబరు41,ప్రభాతవార్త :** ఫార్మాసిటీ తరలిం పు నిర్ణయం హర్షించదగ్గ పరిణామం అని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫార్మా రైతుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గురువారం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ...ఎన్నికలలో ఫార్మా రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని ఫార్మా రద్దు చేసి అక్కడ మంచి టౌన్‌షిప్ ఏర్పాటు చేయబోతున్నాం అన్నారు.వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.రాష్ట్రంలో ప్రజాపాలన ఏర్పడేందుకు ప్రజలు కృషి చేశారు.కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చి హామీలు నేరవేర్చాలని కట్టుబడి పని చేస్తున్నారు.ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేసేందుకు కృషి చేస్తోంది.కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ప్రజల పక్షాన పని చేస్తుంది.2017 అక్టోబరులో కేంద్రం,రాష్ట్రం కలిసి ముచ్చర్ల ఫార్మాసిటీ పేరుతో 20 వేల ఎకరాల భూమి సేకరణ కోసం పని చేసింది.ప్రజాభిప్రాయ సేకరణలో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం 19వేల 330 ఎకరాల భూమి కావాలని అడిగినప్పుడు ప్రజలు వ్యతిరేకం చెప్పారు. ప్రభుత్వం వేల మంది పోలీసులన పెట్టి ప్రజలను అడ్డుకున్నారని అన్నారు.

## మేడ్చల్ నుండి శంషాబాద్ ఏయిర్‌పోర్టుకు బస్సు

**మేడ్చల్, డిసెంబర్ 14, ప్రభాతవార్త ః** మేడ్చల్ నుంచి శంషాబాద్ ఏయిర్‌పోర్టుకు నేటి నుంచి నూతన బస్సులు ప్రారంభించనున్నామని మేడ్చల్ బస్ డిపో మేనేజర్ సుధాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు, మేడ్చ ల్ పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం ఈ బస్సులన ఏర్పాటు చేశామని తెలిపాడు. నేటి నుంచి ఉదయం 5.45, 6,35, 7.25, 8.15, 9.05లకు డిపో నుండి బస్సులు బయలు దేరి కొంపలి, సుచిత్ర, బోయిన్‌పల్లి, ప్యారడైజ్, ట్యాంక్‌బండ్, నాంపల్లి, అఫ్జల్‌గంజ్, శివరాంపల్లి, ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ వరకు 5 బస్సులు ప్రతి రోజు నడుస్తాయన్నారు. సుచిత్ర నుండి ప్రతి 59 నిమిషాలకు ఒక బస్సు, అదే విదంగా శంషాబాద్ ఏయిర్‌పోర్టు నుండి ప్రతి 50 నిమిషాలకు ఒక బస్సు నడుపబడునని పేర్కొన్నాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ కోరాడు.

## ఘనంగా శ్రీరాములవారి కళ్యాణం


స్వామివారి కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**కొత్తూర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** శ్రీరామ్‌నగర్ కాలనీ హనుమాన్ దేవాలయంలో రామనామంతో మార్మోగింది. కొత్తూర్ పురపాలికలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో గల హనుమాన్ దేవాలయంలో రాజేంద్రనగర్, సురేంద్ర ప్రసాద్‌కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కొత్తూర్ మార్వాడి సుందరకాండ భక్తమండలి సభ్యులు సుందరకాండ 100 పారాయణాలు 101 గురువారాలు సుందరకాండ పారాయణాలు పూర్తి చేశారు. ఈ గురు వారం పూర్తికావడంతో శ్రీహనుమాన్ దేవాలయంలో యజ్ఞ హోమాలతో పాటు రాముల వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... హిందూ దర్మంలో అనేక సంస్కృతిక సంప్రదాయంలో పూజ కార్యక్రమాలు ఉంటాయి. ఇలాంటి సంస్కృతి కార్యక్రమాలు చేపట్టడం వల్ల మనసుకు ప్రశాంతత తోపాటు దేవుని కృప వల్ల అందరికి మంచి జరుగుతుందని హిం దువుల యొక్క నమ్మకం అని అన్నారు. ఇలాంటి మహోత్తమ కార్యక్రమాలు చేయడం గొప్ప సంకల్పమన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో విద్యాసాగర్ శుక్ల, పెద్ద ఉమా రాణి శుక్ల, చిన్న ఉమారాణి శుక్ల, విజేత శుక్ల, మహా వీర్ శుక్ల, సీనియర్ నాయకులు మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్, కౌన్సిలర్ వీరమోని హేమదేవేందర్‌ముదిరాజ్, కోస్గి శ్రీనివాస్, జే.వేణుగోపా ల్‌గౌడ్, జె.సుదర్శన్‌గౌడ్, జి.హరినాథ్‌రెడ్డి, నవీన్‌చారి, జె.జగన్, చిలకమర్రి నర్సింహ, వి.శ్రీనివాస్, చంద్, అరవింద్, నిర్మల్, బాబులాల్, జగదీష్, భవాని, శంకర్, అశోక్, బన్వర్‌లాల్, హుక్మీ, చందు, మురళీ దర్, చెన్నారం, హరిలాల్, బంటి మనోజ్, భక్త మం డల సభ్యులు తదితరులు ఉన్నారు.

## ఏపీజీవీబీ బ్యాంకు ఆధార్ కేంద్రం నిర్వహకుడిని తొలగించాలి

**కొడంగల్,డిసెంబర్ 14ప్రభాతవార్త** ఆధార్ అప్‌డెట్ నిమిత్తం ఏపీజీవీబీ బ్యాంకు అధార్ కేంద్రానికి వస్తున్న వారిని ఇబ్బందులకు గురి చేస్తున్న ఆధార్ కేంద్రం నిర్వహకుడిని తొలగించాలని కాంగ్రేస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి ఎస్.సోమశేఖర్ డిమాండ్ చేశారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతు కొడంగల్ పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌లో ఉన్న అధికారి అధార్ అప్‌డేట్ కోసం వచ్చిన ప్రజలతో బెదిరింపుగా మాట్లాడుతున్నాడని ఆరోపించారు.ప్రజలకు కనీస మర్యాద ఇవ్వకుండా మాట్లాడడంతో పాటు బయోమెట్రిక్ కోసం ఒక్కొరి దగ్గర అధిక డబ్బులు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.ప్రజలతో దురుసుగా మాట్లాడుతున్న ఆధార్ సెంటర్ నిర్వహకుడిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలు

# త్వరగా పూర్తి చేయాలి

### అర్హులైన లబ్దిదారులకు అందేలా చూడాలి : మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్


డబుల్‌ఇండ్ల నిర్మాణాల స్థితిగతులపై సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్ పాల్గొన్న అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 14, ప్రభాతవార్త** జిల్లా వ్యాప్తంగ డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, అర్హులైన లబ్దిదారులకు అందించేలా చూడాలని సంబంధిత అధికారులను మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలోని డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాల విషయంపై ఆర్‌అండ్‌బి ఈఈ శ్రీనివాస్ మూర్తి, పంచాయతీరాజ్ ఈఈ సుమేధా, ఆర్డీఓలు శ్యామ్‌ప్రకాశ్, రాజేశ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ (జిహెచ్‌ఎంసి) సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి వివరాలను అధికారులను ముందుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగ జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పెండింగ్‌లో పెట్టకుండ త్వరగా పూర్తి చేయాలని, అవసరమైన తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు ఎన్ని పూర్తి జరిగినవి, లబ్దిదారులకు ఎన్ని పంపిణీ చేశారు. ఇంకా ఎన్ని ఇళ్లు ఏప దశలో ఉన్నాయి అని ఆయా నియోజకవర్గాల అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు ప్రస్తుతం అందజేసే డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు పూర్తి చేసి నిబంధనల ప్రకారం అర్హులైన వారికి అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. దివ్యాంగులు,ఎస్సీ,ఎస్టీల లబ్దిదారులకు కేటాయింపులకు సంబంధించిన వివరాలను, పంపిణీ ప్రక్రియను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అదే విధంగ రాజీవ్‌గృహకల్ప ఇళ్లపై కూడ కలెక్టర్ సమీక్షించి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అధికారులు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లపై పూర్తి స్థాయిలో మానిటరింగ్ చేయాలని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్లక్ష్యం చేయకుండ త్వరగా పూర్తి చేయించాలన్నారు. ఇక నుంచి ప్రతి వారం డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల పరిస్థితిపై సమీక్ష సమావేశం ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశాలకు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగ డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లలో అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పించాలని అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లను అధికారులు సందర్శించి ఏఏ అవసరాలు ఉన్నాయో గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.

సమావేశంలో ఆర్డీఓలు శ్యామ్‌ప్రకాశ్, రాజేశ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అదికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు

# రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదారాబాద్, డిసెంబర్ 14 ప్రభాతవార్త :** జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి కోరారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి స్పెషల్ రివిజన్ 2024పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... శాసన సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఎస్ఎస్ఆర్ 2024లో భాగంగా వచ్చే జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతి, యువకులందరు ఓటర్లుగా నమోదయ్యేలా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం వచ్చే దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించి జనవరి 1వ తేదిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయడం జరుగుతుందని వివరించారు. ఆ తరువాత కూడా ఏవైనా మార్పులు, చేర్పులకు సంబంధించి జనవరి 22వ తేది వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. వచ్చిన దరఖాస్తులను 2024 ఫిబ్రవరి 2వ తేదీ వరకు పరిశీలన పూర్తి చేసి, ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను వెలువరించాల్సి ఉంటుందన్నారు. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓటరు జాబితాలో ఏవైనా లోటుపాట్లు ఉంటే సవరించడం, ఓటరు జాబితాలో పేర్లు తొలగించిన వాటి విషయంలో సమగ్రంగా ఇంటింటి సర్వే చేపట్టి పరిశీలన చేస్తామని, డూప్లికేషన్‌లు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తు, ఇంకనూ ఎక్కడైనా కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఉంటే ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. ముఖ్యంగా 1450 పైచిలుకు ఓటర్లు కలిగిన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం తెలపాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదికారి సంగీత, ఆర్డీఓ లు, తహసీల్దార్‌లు, ఎన్నికల విభాగం అధికారి సైదులు, రాజకీయ పార్టీల ప్రతిని ధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల భూములపై సమగ్ర విచారణ జరపాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాలమల్లేష్ డిమాండ్


కేశవరంలోని గిరిజనుల భూములను పరిశీలించిన రాష్ట్ర సిపిఐ కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేశ్, జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్, మండల కార్యదర్శి టి.రాములుగౌడ్, పలువురు సిపిఐ నాయకులు

**శామీర్‌పేట, డిసెంబరు 14, ప్రభాతవార్త** కేశవరంలోని గిరిజనుల (లంబాడీల) భూముల విషయంపై సమగ్ర విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేశ్ డిమాండ్ చేశారు. గిరిజనుల భూములను మాజీ మంత్రి మల్లారెడ్డి, పలువురు బిఆర్ఎస్ నాయకులు గిరిజనులను మభ్య పెట్టి లాక్కున్నారని ఆయన ఆరోపించారు. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఈ భూముల విషయంపై మల్లారెడ్డితో పాటు మరో ఏడు మందిపై కేసులు నమోదు అయిన సంగతి తెలిసిందే. గురువారం మూడుచింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామాన్ని గిరిజనులు వారసత్వంతో వస్తున్న భూములను ఆయనతో పాటు సిపిఐ నాయకులు, వ్యవసాయ కార్మిక నాయకులు, గిరిజన సమాఖ్య వారి ఆధ్వర్యంలో సందర్శించి గిరిజనులకు న్యాయం చేయాలని, వారి భూములను కబ్జాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అరెస్టులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగ సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేశ్ మాట్లాడుతూ కేశవరం గ్రామంలోని సర్వేనెంబర్లు 33,34,35లలో సుమారు 47.18ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూములు గిరిజనులకు సంబంధించినవని వారసత్వంగ వస్తున్నవని అన్నారు. ఈ భూములను సిఎంఆర్ సంస్థల, మరి కొందరి పేరున అక్రమంగ ఆ భూములు కొనుగోలు చేయటం దారుణమన్నారు. గిరిజనులకు పూర్వం నుంచి వస్తున్న భూములను అక్రమంగ కొనుగోలు చేయటం శోచనీయమని ఆయన ఆరోపించారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి ఈ భూముల విషయంపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని బాలమల్లేశ్ డిమాండ్ చేశారు. గిరిజనుల భూములు గిరిజనులకే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్, ఉమామహేశ్‌లు మాట్లాడుతూ గిరిజనుల భూములు గిరిజనులకే చెందాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. లేకుంటే గిరిజనులకు భూములు దక్కే వరకు సిపిఐ పోరాటాలు చేస్తుందని వారు స్పష్టం చేశారు. కేశవరం గ్రామాన్ని సందర్శించిన వారిలో వారితో పాటు సిపిఐ మండల కార్యదర్శి టి. రాములుగౌడ్, జిల్లా సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి పి.శంకర్, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఆర్.కృష్ణమూర్తి, వి.హరినాథ్‌రావు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి స్వరూప, సిపిఐ నాయకులు అజిత్, శ్రీకాంత్‌యాదవ్, దుర్గం వెంకటేశ, బి.వెంకటేశ, తదితరులు పాల్గొన్నారు.


స్పీకర్‌కు అభినందనలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## స్పీకర్‌కు ఎమ్మెల్యే అభినందనలు

**షాద్‌నగర్, డిసెంబర్ 14, (ప్రభాతవార్త) :** తెలంగాణ శాసన సభ అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్ ఎన్నిక ఏకగ్రీవడం కావడంతో గురువారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభ సమయంలో ప్రోటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌ను ప్రకటించారు. దీంతో సభలో స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ పదవీబాధ్యతలు స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, శాసన సభ సభ్యులు ఆయకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహితం స్పీకర్‌ను కలుసుకొని అభినందనలు తెలియజేశారు. గతంలో ఆయన చేసే సేవలను వీర్లపల్లి శంకర్ కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇలాగే కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం స్పీకర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సహితం ఆయన నమస్కరించారు.

## గుడిసెలు వేసుకున్న బీదలకు పట్టాలివ్వాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రామస్వామి

**చేవెళ్ల, డిసెంబర్ 14 ప్రభాతవార్త :** గుడిసెలు వేసుకు న్న గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రామస్వామి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సిపిఐ కాలనీ ఫేస్ 2లో కాలనీ వాసులు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిధిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. రామస్వామి హజరై సిపిఐ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కాలనీ వాసు లకు ఉద్దేశించి మాట్లాడుతూ... చేవెళ్ల మండల కేంద్రం లోని 75వ సర్వే నెంబర్‌లో గత పది నెలలుగా గుడిసెలు వేసుకుని పట్టాల కోసం పోరాటం చేస్తున్న గు డిసెలు వాసులకు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమైన పట్టా లు ఇవ్వాలని కాలనీలో మౌలిక సదుపాయాలు నీళ్లు, కరెంటు, మొబైల్ టాయిలెట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ నెల 26వ తేదిన మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్స వ వేడుకలు ఉంటాయని ఈ వేడుకలు గ్రామాల్లో ఉన్న కార్యకర్తలు రైతులు, కర్షకులు,కార్మికులు అధిక సంఖ్యలో హాజరై ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శి ఎండి మక్బుల్, బికెఎం యూ జిల్లా అధ్యక్షులు జే. అంజయ్య, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు వడ్ల మంజుల, జిల్లా నాయ కురాలు అమృత, విజయమ్మ, అనసూయ, అంజిరెడ్డి, మల్లారెడ్డి, ఆనంద్, యాదగిరి, శ్రీకాంత్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అభివృద్ధికి కృషి

### గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి


వైకుంఠదామ ప్రహరిగోడ నిర్మాణానికి శంఖుస్థాపన చేసిన గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి

**మేడ్చల్, డిసెంబర్ 14, ప్రభాతవార్త ః** మున్సిపాలిటిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటి పరిధిలోని సుతారిగూడలో వైకుంఠదామానికి ప్రహరిగోడ నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటిలో సమస్యల పరిష్కారినికి ఎప్పిటికప్పుడు కృషి చేస్తున్నామని, ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా తమకు తెలియజేశాయని కోరారు.మన్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ రజిత వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థలోని సమస్యలను పరిష్కరించాలి

**షాద్‌నగర్, డిసెంబర్ 14, (ప్రభాతవార్త) :** నియోజకవర్గంలో విద్యా వ్యవస్థలో చాలా సమస్యలు నెలకొని ఉన్నాయని, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి మీ వంతుగా కృషి చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా కమిటీ నాయకులు గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలుసుకొని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మొదటగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాఠశాలల్లో కనీసం తరగతి గదులను ఊర్చేందుకు పారిశుద్ధ్య కార్మికులు కూడా లేని పరిస్థితి నెలకొని ఉందని, అదేవిధంగా సరైన మూత్రశాలలు లేవని, తాగునీరు సహితం కొన్ని పాఠశాలలో అందుబాటులో లేవని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలకు వాణిజ్య మీటర్లు ఉండటంతో వల్ల కరెంటు ఛార్జీలు విపరీతంగా వస్తున్నాయని వాటిని కట్టలేని పరిస్థితి ఉందని వాటి స్థానంలో డోమెస్టిక్ మీటర్లను బిగించేవిధంగా చూడాలని వారు కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెనుభారంగా మారిన సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరణ చేసేవిధంగా చేసి తమ సమస్యలను పరిష్కరించాలని వారు ఎమ్మెల్యే ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమస్యల పరిష్కారానికై తన వంతు సహాయసహకారాలు తప్పని సరిగా అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, జిల్లా కార్యదర్శులు వెంకటయ్య, శివారెడ్డి, నర్సింలు, వివిధ మండలాల బాధ్యులు కృష్ణయ్య, సమత, శేకర్‌గౌడ్, వలిగి కృష్ణ, బాలయ్య, చంద్రశేఖర్, సత్యం, ప్రేమ్‌సాగర్, సురేందర్, రాములు, జ్ఞానేశ్వరి, రమేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను కలిసిన టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ నాయకులు

# మారిన రూట్..!

### -గచ్చిమౌలి టూ ఎయిర్‌పోర్టు మెట్రో ప్లాన్ రద్దు
### -ఇక కొత్త రూట్లో మెట్రో పరుగు



**హైదరాబాద్, డిసెంబర్ 14 ప్రభాతవార్త**

రాజధాని నగరం పరిసర ప్రాంతాలలో తీవ్ర ప్రభావం చూపే రెండు ప్రధాన ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైలు విస్తరణ మార్గాన్ని మార్చడంతో పాటు నగరానికి దూరంగా ఫార్మాసిటీనీ ఏర్పాటు చేయడం. అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఫార్మాసిటీ ప్రాంతంలో మెగాటౌన్ షిప్ నిర్మించడం కోసం నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే ఓఆర్ఆర్ చుట్టు టౌన్‌షిప్‌లు నిర్మించడంతోపాటు వాటికి మెట్రోరైల్ కనెక్టివిటీగా మెట్రో రైల్ విస్తరణ ఉండే విధంగా చూడడం కోసం ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం విధి విధానాలను రూపొందించడం కోసం అధికారులకు సూచించారు. ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వ నిర్ణయాలపై ఆరా తీశారు. పరిమిత అభివృద్ధికి మాత్రమే ఆస్కారమున్న ఓఆర్ఆర్ వెంట జీవో 111 ప్రాంతంలో ఇప్పటికే ఎంతో అభివృద్ధి చెందిన రవాణా వ్యవస్థ ఉందని, మెట్రో ఎలైన్‌మెంట్‌ను రూపొందించడంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాయదుర్గం నుండి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు నిర్మించాల్సిన మెట్రో విస్తరణ టెండర్లను తక్షణమే నిలిపివేయాల్సిందిగా ఆదేశించారు. నగరంలో జనాభా సెంట్రల్, తూర్పువైపు, ఓల్డ్‌సిటీలో ఉందని ఈ వైపు మెట్రో అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. తద్వారా ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థను అందించినట్లవుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు తెలిపారు. అందుకనితా జాగా ఎంజీబీఎస్ బస్టాండ్ మీదుగా ఫలక్‌నుమా, ఎల్‌బీ నగర్, చంద్రాయణగుట్ట, శంషాబాద్ విమానాశ్రయం మీదుగా ఎలైన్‌మెంట్ రూపొందించడం కోసం ఆదేశాలు జారీ చేశారు. కాగా ఇక్కడ రెండు మార్గాలను పరిశీలించాల్సిందిగా సూచించారు. ప్రభుత్వానికి ఖర్చుతగ్గే విధంగా పరిశీలన ఉండాల్సిందిగా సూచించారు. అలాగే మెట్రోరైల్ మార్గం స్ట్రెయిట్‌గా ఉండడం వల్ల నిర్మాణ ఖర్చు తగ్గుతుందని అధికారులకు తెలిపారు. చంద్రాయణగుట్ట, బార్కాస్, పహాడీషరీఫ్, శ్రీశైలం రోడ్డు మార్గాన్ని, రెండవది చంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, జల్‌పల్లి, ఎయిర్‌పోర్టు పీ7 రోడ్డు మార్గాన్ని ఎంచుకున్నారు. ఈ మార్గాల ద్వారా మెట్రోరైలు అధిక జనాభాకు ఉపయోగపడడంతో ఇతర రవాణా వాహనాలపై వత్తిడి తగ్గుతుందని రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు మార్గంపై టెండర్ల ప్రక్రియను నిలిపివేయాల్సిందిగా ఆదేశించారు. శంషాబాద్ నుంచి ఎయిర్‌పోర్టుకు ఓఆర్ఆర్ ఉండడంతో ఈ కారిడార్‌లో మెట్రోలైన్ అనవసరమని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు మెట్రోలైన్ విస్తరణకు టెంటర్లను కూడా ఆహ్వానించింది. ఈ ప్రాజెక్టుకు దాదాపు రూ. 6వేల 250 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. హెచ్ఎండీఏ నుండి రూ. 6వందల కోట్లు ఇస్తున్నట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆలోగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో టెండర్లను ఖారారు చేయలేకపోయింది. ఇప్పుడు కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఎన్నికలకు ముందు పిలిచిన టెండర్‌లను రద్దు చేసి తాజా నిర్ణయాలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా మెట్రో మొదటి దశలో ఉన్న ఒప్పందం మేరకు ఓల్డ్ సిటీలోని ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రోమార్గాన్ని పూర్తి చేయకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆరా తీశారు. ఓల్డ్‌సిటీ అభివృద్ధిపై ఇది ప్రభావం చూపిందని అభిప్రాయం వ్యక్తం చేస్తూ దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మరోవైపు ఈస్ట్ వెస్ట్ రోడ్డు కమ్ మెట్రోరైలును మాస్టార్ ప్లాన్‌లో భాగంగా చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఇందులో నాగోలు నుంచి గండిపేట వరకు ఎంజీబీఎస్ మెట్రోను మూసి కారిడార్‌లో భాగంగా నిర్మించనున్నారు.

**నగరానికి దూరంగా ఫార్మాసిటీ....**

గ్రేటర్ హైదరాబాద్ దగ్గరలో కాలుష్యకారకమైన ఫార్మసిటీని నిర్మించే ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే కందుకూరు సమీపంలో ఫార్మసిటీ కోసం భూమిని సేకరించారు. ఈ స్థలంలో పర్యావరణహిత మెగా టౌన్‌షిప్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. కాలుష్య కారకమైనవి నగరానికి దగ్గరగా ఉండకూడదని అభిప్రాయపడ్డారు. ఫార్మాసిటీనీ నగరానికి దూరంగా ఏర్పాటు చేయాలని అధికారులక తెలిపారు. ఇక్కడ నిర్మించే మేగాసిటీకి ఎయిర్‌పోర్టు నుంచి శ్రీశైలం రోడ్డులోని తుక్కగూడ మీదుగా కందుకూరుకు మెట్రోరైలును అనుసంధానించాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో 40శాతం పట్టణీకరణ ఉందని, మరింత అభివృద్ధి చెందుతున్న కారణంగా ఓఆర్ఆర్ చుట్టు శాటిలైట్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. రానున్న రోజుల్లో ఇక్కడ 2నుంచి 3 కోట్ల జనాభా ఆశ్రయం పొందే అవకాశం ఉందన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. హైద్రాబాద్‌కు ప్రపంచ నగరంగా అభివృద్ధి చెందేందుకు అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అందుకని నగరంతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

## రాజకీయ నాయకులకు వినూత్న వ్యూహాలు అందిస్తాం : విధాత

**సైఫాబాద్, డిసెంబరు 14 ప్రభాతావార్త:** ప్రస్తుతం రాజకీయ ఎన్నికల ప్రచారంలో అనేక మార్పులు వస్తున్న నేపథ్యంలో సరికొత్త పద్దతులతో దక్షిణ భారతదేశంలో కొత్త ప్రమాణాలు నెలకొల్పి వినూ త్న వ్యూహాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి తమ సంస్థ నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని విధాత కన్సల్టింగ్ తెలిపింది. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆ సంస్థ ప్రతినిధులు జనగాం రాజ్, ప్రశాంత్, సాయికిరణ్ తదితరులు మాట్లాడుతూ నియోజకవర్గాల్లో ని ప్రజల సమస్యలపై అధ్యాయనం చేసి, అమలు జరగడానికి సూచనలు అందిస్తూ, ఎప్పటికప్పుడు ప్రచారంపై ఎత్తులు వేస్తూ రాజకీయ నాయకులకు విశేషమైన సేవలు అందించడానికి సిద్దంగా ఉన్నామన్నారు. ముఖ్యంగా రాబోయే ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ ఎన్నికల్లో నాయకులకు ప్రచార నిర్వహణ, వ్యూహ రచన, నాయక త్వం పెంపొందించే వ్యూహం, కార్యాలయం నిర్వహణ, డిజిటల్ ప్రచా రాలు, సోషల్ మీడియా నిర్వహణ, అధునిక సాంకేతిక పరిజ్ఞానం, నకిలీ ఓట్లు గుర్తింపు, పోల్ మేనేజ్‌మెంట్, ఎన్నికల కార్యాలయాల నిర్వహణ చేపడతామని వివరించారు.

## ఎమ్మెల్యే పద్మరావు గౌడ్‌కు ఘనసన్మానం

**మెట్టుగూడ, డిసెంబర్ 14 ప్రభాతవార్త:**

బీఆర్ఎస్ మెట్టుగూడ డివిజన్ అధ్యక్షుడు ఎ.ఆర్.కృష్ణ ఆద్వర్యంలో సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా ముచ్చటగా మూడోసారి ఘనవిజయం సాధించిన పద్మారావు గౌడ్‌కు శాలువాకప్పి ఘనంగా సన్మానించా రు. ఈ సందర్భంగా ఏఆర్.కృష్ణ మాట్లాడుతూ నియోజక వర్గంలో ని అన్ని డివిజన్ల అభివృద్దికి ఆయన ప్రత్యేక చర్యలు తీసుకున్నారని అందుకోసం పజ్జన్నను ప్రజలకు మరో సారి భారీ మెజార్టీతో గెలిపించారని పేర్కొన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం, అభివృద్ధి కోసం ఆయన కృషి చేయడం జరిగిందన్నారు. 50ఏండ్లలో ఎవరు చేయలేని అభివృద్ధి పనులను కేవలం తొమ్మిది ఏళ్లలో చేసి చూపించిన ఘనత పద్మారావుగౌడ్‌కు మాత్రమే దక్కిందన్నారు. మరింత అభివృద్ధి కోసం తిరిగి పద్మారా వుగౌడ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవడానికి అభిమానులు, బీఆర్ ఎస్ శ్రేణులు, ప్రజలు చేసిన కృషిని మరువలేమన్నారు. ఆయన అందరికి తగిన గుర్తింపునిస్తారని చెప్పారు.

# నామినేటెడ్ పదవుల కోసం
# ఆశావహుల ఎదురుచూపులు

### -సిఎం రేవంత్ ప్రసన్నం చేసుకునే పనిలో నేతలు



**హైదరాబాద్, డిసెంబరు 14 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్త సర్కార్ కొలువు దీరింది. పదేళ్లుగా పదవుల కోసం ఎదురుచూస్తున్న కాంగ్రెస్ నేతలు ఇక నామినేటెడ్ పోస్టుల కోసం పరుగులు మొదలు పెట్టారు. గత బిఆర్ఎస్ సర్కార్‌లో కార్పొరేషన్ చైర్మన్లుగా అత్యధికంగా నగరవాసులకు దక్కించుకోగా, ఇదే తరహాలో రేవంత్‌రెడ్డి సర్కార్‌లోనూ గ్రేటర్ హైదరాబాద్‌కు ప్రాధాన్యత ఉంటుందని ఆరాటపడుతున్నారు. మంత్రులతో పాటు రాష్ట్ర స్థాయి, ఢిల్లీలో తమకున్న పరిచయాలతో ఆశావాహులు తెగ పావులు కదుపుతున్నారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానం కూడా సొంతం చేసుకోలేకపోయింది. ఇక్కడ బిఆర్ఎస్ 16 స్థానాల్లో, ఎంఐఎం 7, బిజెపి ఒక్క స్థానంతో సరిపెట్టుకోగా, గ్రేటర్‌లో కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకొనిపోయింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఈ పరిస్థితి ఉండడం ఆపార్టీకి మింగుడుపడడం లేదు. దీంతో ఇక్కడ పార్టీని బలోపేతం చేయడంతో పాటు గ్రేటర్ నేతలకు కీలకమైన పదవులు లభించే అవకాశాలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో గ్రేటర్ నుంచి ప్రాతినిధ్యం లేకుండా పోయింది. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మల్కాజ్‌గిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందిన మైనంపల్లి హనుమంతరావుకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి మంత్రివర్గంలో తీసుకుంటారని ప్రచారం జరుగుతోంది. నాంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి గెలుపు అంచులవరకు వెళ్లిన కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు ఫిరోజ్‌ఖాన్‌కు కీలక పదవి దక్కే అవకాశాలు లేకపోలేదు. మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన పార్టీ అభ్యర్థులు, ఎన్నికల్లో టికెట్ దక్కని నేతలు, సీనియర్ కాంగ్రెస్ నేతలు ఒక్క ఛాన్స్ అంటున్నారు. పిసిసి ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, పిసిసి కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్, యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ కుమార్‌యాదవ్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు బలమూరి వెంకట్, యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మోతె రోహిత్, ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు ఎన్నో ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తున్న నాయకులు ఇప్పుడు తమ పార్టీ అధికారంలోకి రావడంతో ఇక పదవుల కోసం పరుగులు పెడుతున్నారు.

ఇటీవల బిఆర్ఎస్ ప్రభుత్వంలో నియమించిన 54 కార్పొరేషన్ చైర్మన్లను తొలగించింది. కేబినెట్ హోదా కలిగిన పదవులతో పాటు జిల్లా స్థాయి కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీలు, దేవాలయాల కమిటీలు..అనేకం ఉన్నాయి. రాష్ట్ర స్థాయి కేబినెట్ హోదా కలిపి కార్పొరేషన్ చైర్మన్ పదవుల కోసం ఇప్పుడు కాంగ్రెస్ లీడర్లుల అనేక మంది పోటీ పడుతున్నారు. వివిధ సమీకరణలతో ఒక్క ఛాన్స్ అంటున్నారు. పార్టీ కోసం శ్రమించిన వారు వేట ముమ్మరం చేశారు. వారిలో ఒసి, బిసి, ఎస్సీ, ఎస్టీ సమీకరణలతో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటికే ప్రభుత్వం నామి నేటెడ్ పోస్టులపై దృష్టిపెట్టింది. దీంతో ఆశావా హులు తమ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌లోనూ గ్రేటర్ హైద రాబాద్‌కు నామినేటెడ్ పోస్టుల్లో పెద్దపీట వేస్తారా? గ్రేటర్ నేతలకు ఎంత మందికి పోస్టులు దక్కుతాయే తెలియాలంటే మరికొంత కాలం వేచి ఉంచాల్సిందే.




## మరో 5 మార్గాల్లో విమానాశ్రయానికి ఆర్టీసి బస్సులు

**హైదరాబాద్, డిసెంబరు 14 ప్రభాతవార్త**

శంషాబాద్ విమానాశ్రయానికి ఇప్పటికే 40కి పగైఆ ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు నగరం నలువైపుల నుంచి నడుస్తుండగా..మరో ఐదు రూట్ల నుంచి నాన్ ఏసీ బస్సులు నడపనున్నట్లు టిఎస్ఆర్టీసి గ్రేటర్ హైదరాబాద్ జోన్ ప్రకటించింది. శుక్రవారం నుంచి కొత్త సర్వీసులు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. ఈ బస్సుల్లో సాధారణ టికెట్ ధరలే ఉంటాయని, మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చునని గ్రేటర్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు.

-రూట్ నంబర్ 295ఏ: కేపీహెచ్‌బి మెయిన్ రోడ్డు-రాజీవ్‌గాంధీ విమానాశ్రయం వద్ద నాలుగు ఆర్డినరీ బస్సులు వేశారు.

-రూట్ నంబర్ 229/95ఏ: సుచిత్ర-విమానాశ్రయం మధ్య ఐదు మెట్రో ఎక్స్‌గ్రెస్‌లు నడపనున్నారు.

-రూట్ నంబర్ 3కె/95 ఏ ఈసీఐఎల్ క్రాస్ రోడ్డు-విమానాశ్రయం మధ్య నాలుగు మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు తిప్పనున్నారు.

-రూట్ నంబర్ 303 బస్సు కొండాపూర్-విమానాశ్రయం మధ్య నాలుగు సిటీ ఆర్డినరీ సర్వీసులను అందుబాటులోకి తెచ్చారు.

-రూట్ నంబర్ 90 ఎల్/251 ఏ బస్సు సికింద్రాబాద్-విమానాశ్రయం మధ్య నాలుగు మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడపనున్నారు.

**సికింద్రాబాద్-పటాన్‌చెరు మధ్య ఏసీ బస్సులు..**

సికింద్రాబాద్-పటాన్‌చెరు మధ్య మెట్రో ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను టిఎస్ ఆర్టీసి గ్రేటర్ హైదరాబాద్ జోన్ ప్రవేశపెట్టింది. రూట్ నంబర్ 219తో 8 బస్సులు ఈ మార్గంలో శుక్రవారం నుంచి నడుస్తాయి. ప్రతి 24 నిమిషాలకు ఓ బస్సు అందుబాటులో ఉంటుందని ఈడీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. సికింద్రాబాద్ నుంచి ఉదయం 6,10, పటాన్‌చెరు నుంచి ఉదయం 7.45కి మొదటి బస్సు ఉంటుంది.

## వైకుంఠ ద్వార దర్శనానికి ముస్తాబవుతున్న శ్రీవారి ఆలయం

### -23న వైకుంఠ ద్వార దర్శనం



శ్రీవారి ఆలయం ముఖద్వారం

**చిక్కడపల్లి, డిసెంబరు 14 ప్రభాతవార్త:** హిందువుల ముఖ్యమైన పండుగలలో వైకుంఠ ఏకాదశి(ముక్కోటి ఏకాదశి) ముఖ్యమైన పండుగ. ఈ పర్వదినోత్సవాన్ని ఎంతో పవిత్రమైన దినంగా భావిస్తారు. కాలపరిగణంలో తెలుగువారిది చాంద్రమానం. వైకుంఠ సౌరమా న ప్రకారం జరిపే పండుగ. కర్కాటక సంక్రమణం (దక్షిణా యణ) మకర సంక్రమణం (ఉత్త రాయణం) తదితర పర్వదినాల వలె ఇది కూడా సౌరమానాన్ని అ నుసరించి జరిపే పండుగలలో ఒకటి. ధనురాశిలోకి రవి ప్రవేశిం చిన తర్వాత వచ్చే శుద్ధ ఏకాదశి వైకుంఠ ఏకాదశి. ఇది మార్గశిర మాసంలో కాని పుష్యమాసంలో కాని వస్తుంది. వైకుంఠ ఏకాదశి రోజున శ్రీమన్నా రాయణుని ఉత్తర ద్వారం నుంచి కూడా సేవించుకుంటారు. ఈ ఒక్క ఏకా దశి మూడు కోట్ల ఏకాదశులతో సమానమైన ఫలితం ఇస్తుందని పెద్దల వచ నము. ఈ రోజు శ్రీమన్నారాయణుని దర్శించిన వారికి పునర్జన్మలేదని శాస్త్ర ప్రమాణము. అటువంటి రోజున గోదాదేవి రచించి ఆలపించిన 'తిరు ప్పావై'లోని ముప్పది పాశురాలు కూడా చాలా విశిష్టమైనవి. అందులో 27వ పాశురం 'కూడారై' పాశురం చాలా విశిష్టతను పొందినదని పెద్ద వచనము. ఈ కూడారై నాడు గోదాదేవి తాను చేసే వ్రతాంగముగా ఈనాడు '108' గంగాళాల పాయసాన్నాన్ని భగవానునికి నివేదన చేసింది. నాటి నుంచి 27వ పాశురమైన 'కూడారై' రోజున శ్రీ వైష్ణవాలయాలలో పాయసాన్నాన్ని ఉత్సవాంగముగా నివేదన చేస్తారు. ఈ రోజు శ్రీమన్నారాయణుని ఉత్తర ద్వారంలో సేవిస్తేనే పునర్జన్మ ఉండదని శాస్త్ర ప్రవచనము. అంతేకాకుండా ఈ ఉత్సవంలో పాల్గొన్న వారికి ఆయురారోగ్యం, ఐశ్వర్యములతో పాటు, పెళ్లికాని వారికి (కుజదోషం, కాలసర్పదోషం, నాగదోషం) ఈతి బాధలలో ఉన్నవారికి ఈ ధనుర్మాస వ్రతాన్ని ఆచరిస్తే సత్ఫలితాలు, మనోభీష్టి సిద్ధి తప్పక కలుగుతుందని వేదపండితులు పేర్కొంటున్నారు. ఈ మహత్తరమైన చరిత్ర ఉన్న ఈ రెండు పండుగలు ఒకేసారి రావడంతో భక్తుల ఆనందానికి అవధులు లేకుండాపోతున్నాయి. ఈ ఉత్సవంలో భక్తిప్రపత్తులతో పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు తండోతతండాలుగా రావడానికి ఉత్సాహం చూపుతున్నారు. ఇందులో భాగంగా చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయం ఇప్పటికే ఈ రెండు విశిష్టతలు తెలుసుకున్న భక్తులు పెద్దసంఖ్య లో హాజరయ్యే అవకాశం ఉంది.

**వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు శ్రీవారి ఆలయం సిద్ధం**

కాగా ధనుర్మాసోత్సవాలో భాగంగా 2023 డిసెంబరు 23న ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్, సహాయ కమిషనర్ రామాంజనేయులు వివరించారు. 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి భక్తులకు వైకుంఠ ద్వారదర్శనం ఉం టుందన్నారు. 23 నుంచి 27వరకు రాపత్తు ఉత్సవాలు, 27న రాత్రి ఏడు గంటలకు నమ్మాళ్వార్ పరమ పదోత్సవం ఉంటుందన్నారు. 2024 జన వరి 11న ఉదయం ఐదున్నర గంటలకు కుడారై ఉత్సవం ఉంటుందని, 14న భోగి పండుగ సందర్భంగా రాత్రి ఏడు గంటలకు గోదా సమేత రంగ నాథస్వామి వారి కల్యాణం ఉంటుందని, 15న మకర సంక్రమణ పర్వదినో త్సవం సందర్భంగా ఉత్తరాయ పుణ్యకాలం ఉంటుందన్నారు. 16న కనుమ పండుగ సందర్భంగా ఉదయం 11 గంటలకు గోదాఅమ్మవారి కరినోము ఉత్సవాలుంటాయని, భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు. వైకుంఠ ద్వారదర్శనం సందర్భంగా భక్తుల కు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయం అధికారులు వెల్లడించారు.

**భారీపోలీసు బందోబస్తు**

కాగా వైకుంఠ ద్వారదర్శనాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య వివరించారు. ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్న కారణంగా ఈ ఏర్పాట్లు చేశామని వివరించారు.

# కన్నీరు తెప్పిస్తున్న ఉల్లి, వెల్లుల్లి

### -గణనీయంగా పెరిగిన ధరలు



**ముషీరాబాద్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:**

ఉల్లిగడ్డ కొన్నాక తరుగుతూ ఉంటే కన్నీరు రావటం సహజం కానీ నేడు మార్కెట్‌లో ఉల్లి, వెల్లుల్లి కొనాలి అంటేనే పేదల కళ్ల నుండి నీరు వస్తోంది. ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదు అనే సామెత అక్షరసత్యం అని నమ్మే మన తెలుగువారు ఉల్లి, వెల్లుల్లి లేనిదే ఏ వంట కూడా చేయలేరు అనటంలో ఎటువంటి సందేహం లేదు. అటువంటి ఉల్లి, వెల్లుల్లి ధరలు ఆకాశాన్నంటుతూ ఉండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గతంలో కిలో రూ.20 ఉండే ఉల్లి ధర గత మూడు నెలలుగా పెరుగుతూ, తగ్గుతూ నేడు కిలో 60 రూపాయలకు చేరింది. అదే విధంగా వెల్లుల్లి ధర రెండు నెలల క్రితం కిలో 150, 200 రూపాయలు ఉండగా నేడు కిలో వెల్లుల్లి ధర రూ.350 కు పెరిగింది.

అకాల వర్షాల కారణంగా పంట దెబ్బతిని, వెల్లుల్లి ధరలు ఈ విధంగా పెరిగాయంటున్నారు వ్యాపారులు. ముఖ్యంగా వెల్లుల్లి అధికంగా పండించే రాజస్థాన్‌లో సైతం వెల్లుల్లి ధరలు పెరుగుతూ ఉండటంతో దీని ప్రభావం దేశ వ్యాప్తంగా పడిందని భావిస్తున్నారు. ధరలు పెరగటంతో మండీలకు వెల్లుల్లి రాక తగ్గింది. సహజంగా ప్రతి సంవత్సరం డిసెంబర్ ప్రాంతంలో వెల్లుల్లి ధరలు కాస్త ఎక్కువగానే ఉంటూ ఉంటాయి. కానీ ఈసారి గణనీయంగా ధరలు పెరగటంతో కొత్త పంట వచ్చినప్పటికీ ధరలు ఎంత వరకు తగ్గుతాయో వ్యాపారులు సైతం చెప్పలేమంటున్నారు.

ఉల్లి, వెల్లుల్లి ధరల ప్రభావం హోటళ్లపై కూడా పడే అవకాశం ఉంది. నగరంలో లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు నిత్యం హోటళ్లమీద, పీజీల మీద ఆధారపడుతూ ఉంటారు. ఈ ఉల్లి, వెల్లుల్లి ధరల పెరగటంతో వాటిని విరివిగా ఉపయోగించే హోటళ్లు, పీజీలు సైతం ధరలను పెంచే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని, పేదలకు భారంగా తయారవుతున్న ఉల్లి, వెల్లుల్లి ధరలను నియంత్రించాలని పేద, మధ్యతరగతి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా పద్మారావు గౌడ్ ప్రమాణస్వీకారం

**సికింద్రాబాద్, డిసెంబర్ 14 ప్రభాతవార్తః**

సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో ఎన్నికైన తీగుళ్ల పద్మారావు గౌడ్ గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యేగా పద్మారావు గౌడ్ ప్రమాణం చేయడం నాలుగోసారి, ప్రోటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ పద్మారావు గౌడ్‌తో ప్రమాణం చేయించారు. 2014 నుంచి వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికై సికింద్రాబాద్‌లో హ్యాట్రిక్ సాధించిన పద్మారావు గౌడ్ తొలుత 2004లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అప్పటి ఎన్నికల్లో ఆయన 3067 ఓట్ల మెజారిటీ లభించింది. అనంతరం 2014లో 25వేల 979, 2018 ఎన్నికల్లో 45వేల 470 ఓట్ల మెజారిటీ రాగా 2023 ఎన్నికల్లో 45వేల 240 మెజారిటీ లభించింది.

## ఉద్యోగం పేరుతో రూ. 56వేలు మోసపోయిన యువతి

### -తుకారంగేట్ పోలీసులకు ఫిర్యాదు

**అడ్డగుట్ట, డిసెంబర్ 14 ప్రభాతవార్త:** జాబ్ పేరిట ఓ యువతిని మోసం చేసి రూ. 56వేలు కాజేసిన సంఘటన తుకారంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈస్ట్ మారేడ్‌పల్లికి చెందిన సింధు (24)కు వారం రోజుల కిందట గుర్తు తెలియని వారు ఫోన్‌చేసి తాము నౌక్రి డాట్ కామ్ నుంచి మాట్లాడుతున్నామని, బైజూస్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి అప్లికేషన్ ఫామ్ కోసం రూ. 3వేలు కట్టించుకున్నారు. అనంతరం ఇంటర్వ్యూ తీసుకొని సెలెక్ట్ అయినట్లు చెప్పి డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం రూ. 8వేలు కట్టించుకున్నారు. అదే విధంగా ట్యాప్‌టాప్ కోసం కూడా అనిచెప్పి మరికొంత సొమ్ము చెల్లించుకున్నారు. ఏదో విధంగా చెప్పి డబ్బులు కట్టించుకుంటున్నారు కాని ఉద్యోగానికి సంబంధించిన ఎటువంటి వివరాలు చెప్పకపోవడంతో మోసపోయానని ఆలస్యంగా గ్రహించి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



తెలంగాణ పర్యాటక శాఖ ,భారత నౌకాదళం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నేవీ బ్యాండ్ ప్రదర్శించిన దృశ్యం

# భర్త కళ్లెదుటే భార్య ఆత్మహత్య

### - ఉన్మాదిగా మారిన భర్త
### - ఫోన్‌తో వీడియో తీసిన వైనం
### - రిమాండ్‌కు తరలించిన పోలీసులు

**మెహిదీపట్నం, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** భర్త కళ్లెదుటే భార్య ఆత్మహత్యకు పాల్పడుతున్న సంఘటనను వీడియోతీసి ఆనందించాడు ఓ భర్త. కన్న బిడ్డలు సైతం ఏడుస్తున్నా కనికరించలేదు. నిత్యం మద్యం తాగి ఉన్మాదిగా మారిన భర్త వేదింపులు తాళలేక మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆసీఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ జి. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..ఆసీఫ్‌నగర్ సయ్యద్ అలీగూడకు చెందిన షేక్ రసూల్ (39)కు ఇద్దరు భార్యలు. నాలుగు సంవత్సరాల క్రితం రెండవ భార్య అయిన అర్షాబేగం (22)ను ప్రేమించి పెళ్లి చేసుకోగా వీరికి ఇద్దరు పిల్లలు. రెండవ భార్యను పెళ్లి చేసుకోవడంతో మొదటి భార్య తన తల్లిదండ్రులు ఉంటున్నటువంటి టప్పాచబుత్రలో ఉంటూ జీవనం కొనసాగిస్తుంది. ఈమెకు నలుగురు సతానం. షేక్ రసూల్ మాత్రం రెండవ భార్య వద్దనే ఉంటూ కార్పెంటర్‌గా పనిచేస్తూ తన రెండు కుటుంబాలను పోషిస్తున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసైన షేక్ రసూల్ రెండవ భార్య అర్షాబేగంను వేదించసాగాడు. గత కొద్ది రోజులుగా వేధింపులు ఎక్కువ కావడంతో అర్షాబేగం తన భర్తను మద్యం తాగవద్దంటూ బ్రతిమిలాడింది. అయినా వినకుండా మద్యం తాగివస్తుండడంతో ఈనెల 11న భర్తతో అర్షాబేగం గొడవకు దిగి ఉరివేసుకుంటానని బెదిరించింది. బెదిరింపులను లెక్కచేయకుండా నీవుచస్తే మొదటి భార్య వద్దకు వెళ్తానని షేక్ రసూల్ భార్యను బెదిరించాడు. అర్షాబేగం తన చీరెతో ఫ్యానుకు ఉరివేసుకుంటుంగా భర్త ఆపకపోగా మద్యం మత్తులో తన వద్ద ఉన్నటువంటి సెల్ ఫోన్‌లో వీడియో తీస్తూ ఆనందించాడు. భార్య మృతి చెందిన విషయాన్ని గమనించిన భర్త తన బావమరిదికి ఫోన్ చేసి చెప్పడంతో కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు షేక్ రసూల్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఎబివిపి టెక్నికల్ సెల్ కన్వీనర్‌గా రాకేష్ యాదవ్

**మొయినాబాద్, డిసెంబర్ 14 ప్రభాతవార్త:** ఎబివిపి తెలంగాణ రాష్ట్ర టెక్నికల్ సెల్ కన్వీనర్‌గా దేవరాల రాకేష్ యాదవ్ నియమితులయ్యారు. ఢిల్లీలో జరిగిన 69వ జాతీయ మహాసభల్లో తనను టెక్నికల్ సెల్ కన్వీనర్‌గా నియమించినట్లు ఆయన గురువారం తెలిపారు. ఈ సందర్భంగా రాకేష్ యాదవ్ మాట్లాడుతూ ఇంత పెద్ద బాధ్యత తనపై నమ్మకంతో అప్పగించినందుకు తెలంగాణ రాష్ట్ర శాఖకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలలు, ఇంజినీరింగ్ విద్యార్థుల సమస్యల పట్ల నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

## రైతు సేవలకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

**తాండూరు ఆర్‌డిఓ శ్రీనివాస్‌రావు**



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఓ

**పెద్దేముల్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** రైతులందరికి మద్దతు ధర అందించాలనే ఉద్దేశంతో అన్నదాతలకు అందుబాటులో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తాండూరు ఆర్‌డిఓ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం పెద్దేముల్ మండలంలోని మన్‌సాన్‌పల్లి, మంబాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్‌డిఓ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చూసుకోవాలని సూచించారు. తహసిల్దార్ కిషన్, ఆర్ఐ రాజురెడ్డి మండల వ్యవసాయ అధికారి నసీరుద్దిన్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

**పెద్దేముల్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** బాధిత కుటుంబాలకు పెద్దేముల్ ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మెన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి బాసటగా నిలిచి వారిని ఆదుకోవడం అభినందనీయమని విష్ణు అన్న యువసేన సభ్యులు పర్యాద రవికిరణ్, మేకల రాములు, రత్నప్ప, అనిల్, ఉదయ్, జైపాల్, మల్లేష్, ప్రవీన్, రాములు, సమ్మప్ప, మాణేప్ప తదితరులు అన్నారు. పెద్దేముల్ గ్రామానికి చెందిన మాలే నర్సిములు కూతురు మాలే నవనీత అనారోగ్యంతో మృతిచెందడంతో ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, విష్ణు అన్న యువసేన సభ్యుల ద్వారా రూ. 5 వేలు బాధిత కుటుంబానికి గురువారం అందజేసారు.

## కాళికా దేవి గుడి నిర్మాణానికి భూమిపూజ

**తలకొండపల్లి డిసెంబరు14,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల కేంద్రంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాళీక దేవి గుడి నిర్మాణ చేస్తానని జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ హామీ ఇచ్చారు.ఈ మేరకు గురువారం కాళీదేవి గుడి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలిత జ్యోతయ్య,సింగిల్ విండో డైరెక్టర్ కటికల శేఖర్ యాదవ్,వార్డు మెంబర్స్ నూకం కోటీశ్వర్ ముదిరాజ్, శ్రీను, వెంకటయ్య, స్వరూప,దశరథ,ఎఎంసి డైరెక్టర్ శేఖర్,కో ఆప్షన్ మెంబరు వెంకటయ్య,పాండు నర్సింహ,వెంకటేష్ యాదవ్,డాక్టర్ రవి,మల్లేష్,కిష్టయ్య,కుమార్,శేఖర్,రమేష్, జంగయ్య,శేఖర్, కిరణ్, ప్రవీణ్,శంకరయ్య,అంజయ్య,దీప్త,తదితరులు పాల్గొన్నారు.

## వైద్యానికి బాల్యమిత్రుల సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న బాల్యమిత్రుల బృందం

**ఆమనగల్లు, డిసెంబర్14, ప్రభాతవార్త:** బాల్యమిత్రుని కుటుంబసభ్యులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కుంటూ, ఆర్థిక సమస్యలతో సతమతమవుతుండగా, బాల్యమిత్రుల బృందం ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచింది. వివరాలలోకి వెళితే...ఆమనగల్లు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1998-99 విద్యా సంవత్సరానికి చెందిన రవికి ఇద్దరు సంతానం ఉన్నారు. వారు ఒకరు చెవిటి, మరొకరు మూగ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు వైద్యం అందించేందుకు కృషి చేస్తుండగా ఆర్థిక సమస్యల పరిస్థితులు ఇబ్బందులు పెడుతున్నాయి. విషయం తెలుసుకున్న నాటి బాల్యమిత్రుల బృందం కొంత సొమ్ము పోగు చేసుకున్నారు. ఈమేరకు గురువారం బాల్యమిత్రులు రవి నివాసానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం సమకూర్చున్న 36800 నగదును అందజేశారు. నగదును అందజేసిన వారిలో సయ్యద్ షరీఫ్, కోటి, దేవరకొండ నగేశ్, దంతాల సురేష్, సత్యంసింగ్ తదితరులు ఉన్నారు.

## పరిశుభ్రతపై అవగాహన

**ఆదిభట్ల డిసెంబరు14,ప్రభాతవార్త :** ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ అధికారులు పరిసరాలు పరిశుభ్రత అంశాలపై ప్రతి విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఇందులో భాగంగా మంగళ్‌పల్లి పటేల్ గూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను మున్సిపాలిటీ పరిధిలోని పరిసరాలను శుభ్రం చేయించారు.మన చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరూ ఈ పరిశుభ్రతను తమ వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని అధికారులు పేర్కొన్నారు.ఈ పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమంలో గ్రామంలోని వివిధ నాయకులు,ప్రజలు సైతం పాల్గొనడం ఆనందకరమని మున్సిపాలిటీ అధికారులు పేర్కొన్నారు.

## ఘనంగా వికలాంగుల దినోత్సవం



వికలాంగులను సన్మానిస్తున్న అధికారులు,ప్రజాప్రతినిధులు

**యాచారం డిసెంబరు14,ప్రభాతవార్త :** యాచారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కొప్పు సుకన్య భాషా ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వికలాంగులను శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు,పలువురు వికలాంగులు,తదితరులు పాల్గొన్నారు.

# విద్యా, వైద్యం కోసం అమెజన్ వెబ్ సర్వీసెస్ కృషి చేయడం హర్షనీయం



విద్యార్థుల కోసం భోజనం టేబుల్స్ ను అందజేస్తున్న అమెజన్ ప్రతినిధులు

**షాబాద్, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** విద్యార్థులు ఉత్తమైన ఫలితాలు సాధించాలంటే పాఠశాలలో మెరుగైన మౌలిక సదుపాయాల వసతులు ఉండాలని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ అదనపు డైరెక్టర్ రమణకుమార్ అన్నారు. షాబాద్ మండల పరిధిలోని తెలం గాణ మోడల్ స్కూల్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో కన్సర్న్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన మౌలిక వసతులను ఎడబ్ల్యూఎస్ డేటా సెంటర్ ప్లానింగ్ అండ్ డెలివరీ వైస్ ప్రెసిడెంట్ కెర్రీ, ఎంపీడీవో అనురాధ, ఎంఈవో శంకర్‌రాథోడ్‌లతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ.... విద్యా,వైద్యం కోసం అమెజాన్ వెబ్ సర్వీస్ ఎంతో ఖర్చు చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే తెలంగాణ మోడల్ స్కూల్ కార్పోరేట్ విద్యాలయాలకు ధీటుగా సంస్థ మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ప్రచారానికి పోకుండా సమాజా సేవ కోసం కోట్ల రూపాయాలు ఖర్చు చేస్తున్న అమెజాన్ వెబ్ సర్వీస్ అందిస్తున్న సేవలను వారు కొనియాడారు. ఈకార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీవాచ్య, అమెజన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



సమాశంలో పాల్గొన్న మేనేజర్, వ్యాపారస్తులు

## వ్యాపారస్తుల సహకారం కావాలి : హెచ్‌డిఎఫ్‌సీ మేనేజర్

**శకర్‌పల్లి, డిసెంబరు 14, ప్రభాతవార్త:** శంకర్‌పల్లి మునిసిపాల్‌లోని హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంకులో గురువారం గెట్‌టుగెదర్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ ఎండి శకీల్ అహ్మద్ మాట్లాడుతూ వ్యాపారస్తుల అందరి సహకారం కావాలని, అందరికోసం మేము మా బ్యాంక్ తరపున ఎలాంటి సేవలు అందించడానికైనా మేము ముందంజలో ఉంటామని అన్ని రకాల లోన్లు హోమ్‌లోన్లు, కార్ లోన్లు, అగ్రికల్చర్‌లోన్లు మరియు ఓడి ఏసీలను మా బ్యాంక్ నియామకాలకనుగుణంగా మీకు సేవలు అందిస్తామని అలాగే మీరందరు కూడా మా సేవలను వినియోగించుకోవాలని మా బ్యాంక్ అభివృద్ధిలో మీ భాగస్వామ్యం కావాలని కోరారు. వ్యాపారస్తులు మాట్లాడుతూ మాకు బ్యాంక్‌నుంచి మంచి రెస్పాన్స్‌ుందని భవిష్యత్తులో హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంకు వారికి మా శాయశక్తుల తోడ్పాటు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు ఎండీ జుకీర్, శివకుమార్, వీరేశం, చంద్రకుమార్ , వేనుగోపాల్, రవికుమార్, సత్యనారాయణ, వినోద్, పూర్ణచందర్, గంగేటి రాజు, మరియు బ్యాంక్ సిబ్బంది సతీష్, రాకేశ్‌గౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీలలో పనులు ముమ్మరం చేయాలి

**సర్పంచ్ గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి**



అధికారులతో కలిసి నర్సరీ స్థలాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ లక్ష్మి నరసింహారెడ్డి

**కడ్తాల్,డిసెంబరు 14 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి సంవత్సరం తెలంగాణకు హరితహారం కార్యక్రమంతో మొక్క నాటే కార్యక్రమం యజ్ఞంలా కొనసాగుతుందని కడ్తాల్ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో నర్సరీ ఏర్పాటు కోసం మండల పంచాయతీ అధికారి మధుసూదనాచారితో కలిసి స్థల పరిశీలన చేశారు. పల్లె ప్రకృతి వనం ప్రాంగణంలో ఉన్న స్థలం నర్సరీకి అనుకూలంగా ఉందని ఎంపిఓ తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ నర్సరీ పనులు వేగిరం చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. 2024 సంవత్సరానికిగాను 11 వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా ప్రభుత్వం నుండి సూచనలు అందాయని తెలిపారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమంతో వాతావరణంలో సమతుల్యత మెరుగై వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రాఘవేందర్, నాయకులు గురిగిళ్ల రామచంద్రయ్య, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న నిర్వాహకుడు

**కాంగ్రెస్ పార్టీ కొడంగల్ మండల ప్రచార కార్యదర్శి ఎస్.సోమశేఖర్**

**కొడంగల్ రూరల్, డిసెంబరు 14 (ప్రభాత వార్త):** కొడంగల్ పట్టణంలోని ఏపీజీవీబీ బ్యాంకులో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో నిర్వాహకుడు అంబదాస్ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి ఎస్.సోమశేఖర్ ఆరోపించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ అప్‌డేట్, నమోదు తదితర వాటి కోసం కేంద్రానికి వచ్చే ప్రజల పట్ల అసభ్య పదజాలంతో ఇప్పుడు కాదు, రేపు రండి, మీ ఇష్టం వచ్చిన చోట చేసుకోవాలని బెదిరించడం జరుగుతుందన్నారు. ప్రజల పట్ల అమర్యాదగా మాట్లాడుతూ తన ఇష్టానుసారంగా ఒక్కొక్కరి దగ్గరి నుంచి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 వరకు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

# యువత అభ్యున్నతి కోసం నిరంతరం కృషి

**కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ బూనేటి**



న్యూఢిల్లీలో కేంద్ర సహాయ మంత్రితో మారుతి కిరణ్ బూనేటి

**కుల్కచర్ల;డిసెంబర్14;ప్రభాతవార్త;** యువత అన్ని రంగాల్లో నైపుణ్యం సాదించేందుకు కృషి చేస్తున్నట్టు కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ భూనేటి అన్నారు. గురువారం కేంద్ర ఐటి సహాయ మంత్రి చంద్రశేఖర్ రాజీవ్‌ను ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తే యువతకు ఉపాది అవకాశాలు కలుగుతాయని ఎలక్ట్రానిక్స్ ఐటి సహాయ మంత్రికి ఆయన వివరించారు.తెలంగాణ రాష్ట్రంలో లక్షల మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉపాది లేక నిరుద్యోగులుగా ఉన్నారని రాష్ట్రంలోని 60శాతం మంది విద్యార్థులు హైదరాబాద్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం అధిక మొత్తంలో డబ్బులు వెచ్చించి శిక్షణ తీసుకుంటున్నారని తెలిపారు.ఈ ప్రాంతాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఎర్పాటు చేస్తే యువతకు ఉపాది అవకాశాలు కలుగుతాయని ఆయన వివరించారు.దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి సంబందిత అధికారులతో మాట్లాడి శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసే విదంగా కృషి చేస్తాను అన్నారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బాజాపా సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల సంక్షేమానికి టిఎన్‌జిఓస్ కృషి

**మేడ్చల్ జిల్లా టిఎన్‌జిఓస్ అధ్యక్షులు బి.రవిప్రకాశ్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 14, ప్రభాతవార్త**

పంచాయతీ కార్యదర్శుల సంక్షేమానికి, అభ్యున్నతికి టిఎన్‌జిఓస్ కృషి చేస్తుందని జిల్లా ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్, జిల్లా టిఎన్‌జిఓస్ అధ్యక్షులు బి.రవిప్రకాశ్ పేర్కొన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా కీసర మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం సమావేశం ఆయన ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగ జిల్లా టిఎన్‌జిఓస్ అధ్యక్షులు బి. రవిప్రకాశ్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్స్, రెగ్యులరైజేషన్ (ఒపిఎస్), ఉద్యోగులను (జిపిఎస్)లకు పధోన్నతి కల్పించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకవెళ్తామన్నారు. ఉద్యోగుల పనిభారాన్ని తగ్గించే విధంగ పంచాయతీ కార్యదర్శుల ఆన్‌లైన్ అప్‌డేషన్ మొబైల్ యాప్లో పనులను తగ్గించే విధంగ చర్యలు తీసుకోవాలని కోరారు. 2018పంచాయతీరాజ్ చట్టంను సవరించాలని, పంచాయతీ కార్యదర్శుల విధులు,బాధ్యతలు పునర్వచించాలని ఆయన ప్రభుత్వాని కోరారు. పంచాయతీ కార్యదర్శిల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకవెళ్తామన్నారు. ఈ సమావేశంలో కీసర ఎంపిడిఓ గ్యామ ఈశ్వర్, కేంద్ర సంఘం ఇసి సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి, టిఎన్‌జిఓస్ జిల్లా సంయుక్తకార్యదర్శి శ్రీచంద్, జిల్లా సభ్యులు మహేశ్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్, జిల్లా అధ్యక్షులు టి.వేణుగోపాల్, కోశాధికారి విజయ్‌కుమార్, శశికుమార్, ప్రధాన కార్యదర్శి సునీత, సభ్యురాలు శోభారాణి, ఇసి సభ్యులు బిల్‌కలెక్టర్ మహేందర్‌రెడ్డి, పలువురు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న హైస్కూల్ జిహెచ్‌ఎంకు సన్మానం

**శామీర్‌పేట, డిసెంబరు 14, ప్రభాతవార్త**

దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి బదిలీ కావటంతో ఆ గ్రామ మాజీ ఎంపిటిసి బి.జైపాల్‌రెడ్డి, పలువురు గ్రామ పెద్దలు ఘనంగ సన్మానించారు. గురువారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి దత్తాయిపల్లికి యాదాద్రి- భువనగిరి జిల్లాకు బదిలీ కావటంతో ఆమెను పలువురు మర్యాద పూర్వకంగ సన్మానించి అభినందించారు. ఈ పాఠశాలలో కొన్ని సంవత్సరాల నుంచి విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారని, విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేశారని, పాఠశాల అభివృద్ధికి ప్రత్యేకంగ కృషి చేశారని వారు అన్నారు. ఈ పాఠశాలకు నూతన జిహెచ్‌ఎంగా బాలేశ్ బాధ్యతలు స్వీకరించటం జరిగిందని వారికి స్వాగతం పలకటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బి.జైపాల్‌రెడ్డితో పాటు గ్రామ పెద్దలు రామారావు, నర్సింహ్మారెడ్డి, ఆలయ పూజారి రాము, పాఠశాల పూర్వ విద్యార్థులు గోవిందరెడ్డి, రామరాజు, పలువురు ఉపాధ్యాయులు, పలువురు పాల్గొని ఆమెను ఘనంగ సన్మానించారు.

## బొమ్మరాసిపేటలో సొడాలమ్మ ఆలయం వద్ద బోర్ వేసిన దాత

**శామీర్‌పేట, డిసెంబరు 14, ప్రభాతవార్త**

బొమ్మరాసిపేట్ గ్రామంలోని సొడాలమ్మ ఆలయం వద్ద దాత అయ్యంగారి లక్ష్మారెడ్డి ఉచితంగ బోర్ వేయించి మోటర్‌ను ఏర్పాటు చేశారు. శామీర్‌పేట మండలంలోని బొమ్మరాసిపేట్ గ్రామంలోని సొడాలమ్మ ఆలయం వద్ద గతంలో యాదవ సంఘం నాయకులకు ఇచ్చిన మాట ప్రకారం ఉచితంగ బోర్ వేయించినట్లు నీరు పుష్కలంగ పడటంతో వెంటనే మోటర్ కూడ ఏర్పాటు చేయించినట్లు దాత అయ్యంగారి లక్ష్మారెడ్డి తెలిపారు. దాత లక్ష్మారెడ్డికి యాదవ సంఘం వారు ప్రత్యేకంగ దన్యవాదాలు తెలిపారు. అదే విధంగ కర్కాకలమ్మ గడ్డ కాలనీ వాసులకు దాహార్తిని తీర్చటానికి గతంలో ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేయటం జరిగిందన్నారు. కాలనీ వాసులకు కొత్తగ బోర్ వేయించి మోటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. దీనిలో యాదవ సంఘం నాయకులు, కర్కకాలమ్మ కాలనీ వాసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా అయ్యప్ప స్వామి పడిపూజ

కొత్తూర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త : స్వామియే శరణం అయ్యప్ప.... శరణం శరణం అయ్యప్ప.... అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో కొత్తూర్ మర్మోగింది. కొత్తూర్ మునిసిపాలిటీ పరిధిలోని జర్నలిస్టు మధుసూదన్‌గౌడ్ సోదరుడు వంశీగౌడ్ స్వామి ఆధ్వర్యంలో శర్మ పంతులు కుమారుని నేతృత్వంలో అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..... అయ్యప్ప స్వామి మాలధారణ చేసిన అయ్యప్ప భక్తులు కఠిన నియమాలతో దీక్ష చేపడతారు. నియమనిష్టలతో ఏకభుక్తం తింటూ అయ్యప్ప స్వామికి పూజలు చేస్తూ 41రోజుల పాటు దీక్షను కొనసాగిస్తారు. కఠిన నియమాల్లో బిక్షకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. పూజ కార్యక్రమంలో కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, ఎర్రవల్లి నాగరా జుచారి, నవీన్‌చారి, గురుస్వాములు శర్మపంతులు స్వామి, దాసరి నరసిం హస్వామి, దాసరి శ్రీనుస్వామి, చెన్నారెడ్డి స్వామి, లక్ష్మారెడ్డిస్వామి, సురేష్‌గౌడ్ స్వామి, నరేష్‌గౌడ్‌స్వామి,రాఘవేందర్‌స్వామి, లడ్డు స్వామి, శ్రీకాంత్‌స్వామి, శ్రీవాస్తవస్వామి, అయ్యప్ప స్వాములుఉన్నారు.

## పత్తిమిల్లును తనిఖీ చేసిన తహశీల్దార్

**కొడంగల్,డిసెంబర్ 14ప్రభాతవార్త** కొడంగల్ మండల పరిధిలోని చిన్ననందిగామ స్టేజీ సమీపంలోని పత్తిమిల్లు(విజయ ఇండస్ట్రీస్)ను తహశీల్దార్ బి.విజయ్‌కుమార్ తనిఖీ చేశారు.గురువారం పత్తిమిల్లును సందర్శించిన ఆయన మిల్లు యజమానులతో మాట్లాడారు.రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న పత్తి కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.కొనుగోలు చేసిన స్టాక్ వివరాలతో పాటు ధరలు తదితర అంశాలపై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రైతులు సాగుచేసిన పత్తిని విక్రయించే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.అంతకుముందు మండలంలోని పెద్దనందిగామ తదితర గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహశీల్దార్ పరిశీలించారు.ఈ సందర్బంగా పీఏసీఎస్ అధ్యక్షులు కట్కం శివకుమార్‌గుప్తగోపాల్ తదితరులున్నారు.

## ఈనెల 17 నుంచి వేంకటేశ్వర దేవాలయంలో ధనుర్మాస పూజలు

**కొడంగల్,డిసెంబర్ 14ప్రభాతవార్త** పేదల పెన్నిధిగా పేరుగాంచి రెండవ తిరుపతిగా వెలుగొందుతున్న శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర దేవాలయంలో ఈనెల 17 నుంచి నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభం కానున్నాయని ఆలయ ధర్మకర్తలు తెలిపారు.తిరుమల తిరుపతి దేవాలయంలో మాదిగానే ఆలయంలో వేకువ జామున సుప్రభాత సేవతో మొదలుకొని శ్రీమాన్ ధరూరి శ్రీనివాసాచారి అద వ్యర్యంలో తీరుప్పావై పారాయణం పఠనం చేశారు.అంతకుముందు స్వామి వారికి విశేష అలంకరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్ మాట్లాడుతు ఈనుల 17 నుంచి ప్రారంభంకానున్న ధనుర్మాస పూజలు జనవరి 14 వరకు పూజలు కొనసాగుతాయన్నారు.

## ప్రతి ఒక్కరూ దైవ కార్యక్రమంలో పాల్గొనాలి

**కుల్కచర్ల;డిసెంబర్14;ప్రభాతవార్త;** ప్రతి ఒక్కరూ దైవ కార్యంలో ముందుండాలని బ్లాక్‌బి అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్ అన్నారు.గురువారం కుల్కచర్ల అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో మాలాదారులైన అయ్యప్ప స్వాములకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకుంటిత దీక్షా,కఠోరమైన నిష్టలతో 41 రోజుల పాటు దైవ కార్యం వహించే అయ్యప్ప స్వాములకు తమ వంతు సహయం అందించామని తెలిపారు.రాబోవు రోజుల్లో మరిన్ని సేవలు అందించేందుకు సిద్దంగా ఉన్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో యువ నాయకుడు కుమ్మరా స్వామి,సాల్విడ్ లాలు,కర్రె వినోద్‌కుమార్,గాదె వెంకటేష్ తదితరులు పాల్గొనారు.



స్వాములకు పండ్లు ప్రదానం చేస్తున్న దృశ్యం



కందుకూరు మండలంలో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిశేకం చేసిన కాంగ్రెస్ శ్రేనులు

# సిఎం రేవంత్‌రెడ్డికి రుణపడిఉంటాం

**కందుకూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** ప్రజా ప్రయోజనాల దృష్టా హైద్రాబాద్ ఫార్మాసిటి స్థానంలో మెగా టౌన్‌షిప్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలంగాణ సిఎం ఎ రేవంత్‌రెడ్డి ప్రకటిచడం అభినందనీయమని ఇది బావితరాల భవిష్యత్తుకు అరోగ్యదాయకమని మాజీ జెడ్పిటిసి ఏనుగు జంగారెడ్డి పిఎసిఎస్ మాజీ చెర్మెన్ సరికొండ మల్లేష్, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు జి శమంతప్రభాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హైద్రాబాద్ ఫార్మాసిటి రద్దును సిఎం ప్రకటించగా కాంగ్రెస్ శ్రేనులు మండల కేంద్రంతో పాటు అయా గ్రామాలలో గురువారం ప్రజలు సంబురాలు జరుపుకున్నారు. మండలంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎస్ క్రిష్ణానాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిశేకం చేసి మిటాయిలు పంచుకున్నారు. జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ చేర్మెన్ కె పాండురంగారెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి సరికొండపాండు, అందుగుల సత్యనారాయణ, సులేమాన్, ఎస్ వెంకట్రాంరెడ్డి,నర్సింహ్మాచారి, జగన్, ఎగ్గిడిక్రిష్ణ, వినోద్‌చారి, రాకేష్‌గౌడ్, అజీజ్, అఫ్జల్, సిద్దేశ్వర్‌గౌడ్, సుదాకర్‌రెడ్డి, ప్రశాంత్, మదన్‌పాల్‌రెడ్డి, నర్సింహ్మ, రాకేష్‌గౌడ్, వెంకట్‌నారాయణరెడ్డి, సత్యానారాయణరెడ్డి, కిషన్‌పటేల్, మల్లయ్య, శ్రీకాంత్‌రెడ్డి, వీరేశం, యుగేందర్‌రెడ్డి,మీర్ఖాన్‌పేట మాజీ సర్పంచ్ నర్సింహ్మా పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



అభయాంజనేయస్వామి ఆలయంలో భజనలు చేస్తున్న భజన మండలి సభ్యులు

**ఆమనగల్లు, డిసెంబర్14, ప్రభాతవార్త:** ఆధ్యాత్మికత ఎంతో శక్తివంతమైనదని, ఇది వ్యక్తుల జీవితం, మానసిక, శారీరక, సామాజిక శ్రేయస్సుకు దోహదపడుతుందని శ్రీ శివానందస్వామి అన్నారు. భక్తి సంబంధమైన భావనగా దీనిని పరిగణించాలని ఆయన సూచించారు. సందర్భంగా కూరగాయల మార్కెట్‌లోని శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో శ్రీ అభయాంజనేయస్వామి భజన మండలి ఆధ్వర్యంలో బుధవారం కార్తీక మాసం ముగింపు వేడుకలు నిర్వహించారు. 30రోజుల పాటు శ్రీ అభయాంజనేయస్వామి భజన మండలి ఆధ్వర్యంలో నిత్యం భజనలు గావించారు. ముగింపు వేడుకల కార్యక్రమానికి శ్రీ శివానందస్వామి ముఖ్య అతిథిగా హాజరై ఆధ్యాత్మికత ప్రవచనాలు అందించారు. ప్రవచనాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైనారు. ఆభయాంజనేయున్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ముగింపు వేడుకల సంధర్భంగా చేసిన భజనలు, కీర్తనలతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. ముఖ్య అతిథి శ్రీశివానందస్వామిని నిర్వహకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు వల్లభదాసు గౌడ్, కార్యదర్శి దొంతు సత్యనారాయణాచారి, పాలోజు బుచ్చి రాములు, పాలోజు కృష్ణయ్య, భాస్కరాచారి, జంగయ్య, శ్రీహరి, చక్రపాణి, రామాచారి, పార్థసారథి, లక్ష్మయ్య, వెంకటాచారి, మాణిక్యచారి తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబర్ 14,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండల యూత్ కాంగ్రెస్ నాయకులు గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా శంకర్‌కు శాలువాలు కల్పి సన్మాణం చేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల స్థితిగతులను ఎమ్మెల్యేకు వివరించారు, మండలంలో ఎక్కువ శాతం వ్యవసాయంపై ఆధారపడి ప్రజలు తీవనం సాగిస్తున్నారని వ్యవసాయ రంగానికి పెద్దపీత వేయాలని ఎమ్మెల్యేను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు యూత్ కాంగ్రెస్ సభ్యులు ముందుంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూణు గోపాల్, ఎస్టి సెల్ మండల అధ్యక్షుడు చందునాయక్, అన్వర్, భాస్కర్, రామకృష్ణ, వెంకటేష్, నవీన్‌గౌడ్, సురేందర్, నందు, మసూద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పాండురంగారెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ

**కోట్‌పల్లి,డిసెంబరు 14, ప్రభాతవార్త;** మోమిన్‌పేట్ మండల పరిధిలోని మల్‌రెడ్డిగూడెం గ్రామానికి చెందిన పాండురంగారెడ్డి కూమారుడు అభిలాష్‌రెడ్డి ఇటీవల కాలంలో మరణించడంతో గురువారం నాడు మల్‌రెడ్డిగూడెం గ్రామానికి వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు అనంద్ వెళ్ళి వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి తన ప్రగఢ సానుభూతి తెలియజేశారు. అయన వెంట బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు,

## అన్నం పరబ్రహ్మ స్వరూపం

**నందిగామ డిసెంబరు14,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన నందిగామలోని శ్రీ అయ్యప్ప దేవాలయం స్వాముల శరణు ఘోషతో మార్మోగుతుంది.ప్రముఖ రియల్ ఎస్టేట్ పారిశ్రామికవేత్త,సువర్ణభూమి ఇన్ఫ్రాస్ట్రక్చర్ అధినేత తుడి రామ లచ్చయ్య గురువారం స్వాములకు అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా లచ్చయ్య మాట్లాడుతూ...అయ్యప్ప దీక్షలో ఉన్న స్వాములకు అన్నదానం చేయడం తన పూర్వజన్మ సుకృతం అన్నారు.ఈ వేడుకల్లో గురుస్వాములు బి.లక్ష్మయ్య యాదవ్,దేవల్లె అశోక్ గౌడ్,బి.కృష్ణ గౌడ్,ఎదిరె శ్రీకాంత్ గౌడ్,తుమ్మల నర్సింలు యాదవ్,చించోటి శివ కుమార్ గౌడ్,హరిజీవన్,జంగయ్య గౌడ్,నంబరాజు చారి,రంగాపూర్ శేఖర్ గౌడ్,గడ్డల శ్రీశైలం ఉన్నారు.

## తెలంగాణ స్పీకర్‌కు శుభాకాంక్షలు

**నందిగామ డిసెంబరు14,ప్రభాతవార్త :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా నియమితులైన గడ్డం ప్రసాద్‌కు గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.యువ లెజెండరీ ఎమ్మెల్యేగా జనం మెచ్చిన,నచ్చిన జననేతగా ఎదిగి జన విజేతగా నిలిచిన వీర్లపల్లి శంకర్‌ను నియోజకవర్గ ప్రజలు జయహో వీర్లపల్లి శంకర్ అంటూ జన నీరాజనాలు పలుకుతూ దీవిస్తున్నారు.ఇంతింతై...వటు డింతై అన్నట్లుగా సామాన్య నిరుపేద కుటుంబం నుండి వచ్చిన ఆయన ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లిలో అడుగెటడం షాద్‌నగర్ చరిత్ర పుటల్లో నిలిచిందన్నారు. కోటి కాంతుల చిరునవ్వులతో మీకు ఆయురారోగ్యాలు, అష్టఐశ్వర్యాలు,మానసిక ధైర్యం,మనోబలాన్ని ఆ భగవంతుడు మీకు నిండు నూరేళ్ల ఇవ్వాలని మీ పాలన హయాంలో షాద్‌నగర్ అన్ని మౌలిక సదుపాయాలతో ప్రగతి సాధించి,రూపురేఖలు మారాలని ఆకాంక్షిస్తూ ,నియోజకవర్గ ప్రజలు,అభిమానులు, భగవంతుని కోరుకుంటున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ..ఆత్మాభిమానానికి అందలం ఇచ్చిన షాద్‌నగర్ నియోజకవర్గం ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన ఊపిరి ఉన్నంతకాలం షాద్‌నగర్ నియోజకవర్గం ప్రజలకు సేవకుడిగా పని చేస్తానన్నారు.

# అయ్యప్పలకు అన్నదానం మహాధానం

**షాబాద్, డిసెంబర్ 14, ప్రభాతవార్త :**

షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో గత 27రోజులుగా అయ్య ప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమం గురువారం 28వ రోజు హైతాబాద్ ఎంపీ టీసీ పొన్న జయమ్మవెంకట్‌రెడ్డి అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో గురుస్వామి గోపాల్‌రెడ్డి, పొన్న సన్నిరెడ్డి, అయ్యప్ప స్వాములు ఉన్నారు.





ఎమ్మెల్యే సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి సత్యనారాయణ

## 30 పడకల ఆసుపత్రి, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

**పెద్దశంకరంపేట, డిసెంబర్ 14 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, డిగ్రీ కళాశాలతో పాటు మినీ స్టేడియం మంజూరు చేయాలని కోరుతూ నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డికి సర్పంచి సత్యనారాయణ గురువారం వినతిపత్రం అందజేశారు. పెద్దశంకరం పేట ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వసతులు, పడకలు లేకపోవడంతో రోగులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక విద్యార్థులు దూర ప్రాంతాలకు చదువుకోవడానికి వెళ్లి తీవ్ర ఇబ్బందులకు గరవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే పెద్దశంకరంపేటలో 30 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరారు.

## బీటీ రోడ్డు పనులు పూర్తి



నూతనంగా వేసిన బీటీ రోడ్డు

**కొల్చారం, డిసెంబర్ 14 ప్రభాతవార్త:** కొల్చారం గ్రామ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది. బీటీ రోడ్డుకు మోక్షం లభించింది. ఎట్టకేలకు పనులు పూర్తి అయ్యి రోడ్డు ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొల్చారం-అంసానిపల్లి రోడ్డు గుంతలమయంగా ఉండటంతో గత 15 సంవత్సరాల నుండి ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు బాగో లేకపోవడంతో మండల కేంద్రమైన కొల్చారానికి దాదాపు 5 గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. ఎట్టకేలకు పనులు పూర్తి అయ్యి ప్రజలకు రోడ్డు అందుబాటులోకి వచ్చింది. దీంతో స్థానిక ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ నిధుల ద్వారా 1 కోటి 50 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. నిధులతో సుమారు 3.3 కిలోమీటర్లు మండల కేంద్రమైన కొల్చారం బస్టాండ్ నుండి మెట్టు వరకు బీటీ రోడ్డు వేశారు. ఈ సందర్భంగా గుత్తేదారు మాట్లాడుతూ పూర్తి నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్డు పనులు పూర్తి చేసినట్లు తెలిపారు.

## అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి మోసపొవద్దు : సిఐ



మాట్లాడుతున్న సిద్దిపేట రూరల్ సీఐ చేరాలు

**చిన్నకోడూరు, డిసెంబర్ 14,ప్రభాతవార్త :** అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి మోసపొవద్దని.. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సిద్దిపేట రూరల్ సీఐ చేరాలు అన్నారు. మండల పరిధిలోని రాముని పట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మానవ అక్రమ రవాణా నిర్మూలన గుడ్ టచ్, బాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకొని బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. మహిళలు, యువతులకు ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా షీటీమ్ నంబర్ 8712667344౩కి కాల్ చేయాలన్నారు. మహిళలకు రక్షణగా ఎల్లప్పుడూ షీటీమ్ అండగా ఉంటుందన్నారు. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజశ్రీ, ఉపాధ్యాయులు, షీటీము బృందం కిషన్, పోలీసు సిబ్బంది మమత, వీణకుమారి, ప్రవీణ్,లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి




టిపిటిఎఫ్ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న దృశ్యం

**గజ్వేల్, డిసెంబర్ 14 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని టిపిటిఎఫ్ గజ్వేల్ జోన్ కన్వీనర్ సుంచు నరేందర్ కోరారు.గురువారం గజ్వేల్ మండలం అహ్మదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టిపిటిఎఫ్ గజ్వేల్ మండల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లోఉన్న మూడు డిఏలను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. అలాగే 317 బాధితులకు న్యాయం చేయాలని, 13 జిల్లాల దంపతుల బదిలీలు వెంటనే చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్పవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండల అధ్యక్షుడు పాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగరాజు, దమ్మని మల్లయ్య, హఫీజ్, దయానంద్, శ్రీనివాస్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఏడుపాయల్లో మొక్కు చెల్లించుకోనున్న ఎమ్మెల్యే

**కొల్చారం, డిసెంబర్ 14 ప్రభాతవార్త:** నేడు (శుక్రవారం) ఏడుపాయల వనదుర్గా భవానిమాత దగ్గర 101 కొబ్బరికాయల మొక్కలు చెల్లించుకోవటానికి నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునితా లక్ష్మారెడ్డి రానున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముత్యం ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిఖ సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న సీనియర్ నాయకులు ముత్యం ప్రవీణ్ కుమార్

# అన్యాక్రాంతమైన భూములపై ప్రభుత్వం విచారణ చేయాలి

### కాంగ్రెస్ పార్టీ నాయకులు

**శివ్వంపేట, డిసెంబర్ 14 ప్రభాతవార్త:**

గత కేసీఆర్‌ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని మండలంలోని బీఆర్ఎస్ నాయకులు పేదల భూములను గుంజుకొని అన్యాక్రాంతం చేసినవారిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపిటీసీసభ్యులు జంగం విజయవెంకటేష్, నాయకులు శేరిపల్లి నరేష్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ నర్సాపూర్ బ్లాక్ అధ్యక్షుడు భాసంపల్లి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి హరీష్‌రావు కనుసన్నల్లో రెవెన్యూఅధికారుల అండదండలతో మండలంలోని ప్రతి గ్రామంలోనూ బీఆర్ఎస్ నాయకులు భూకబ్జాలు చేశారని ఆరోపించారు.

**సికింద్లాపూర్ భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలి**

ఎన్నో ఏళ్లుగా సికింద్లాపూర్ గ్రామ రెవెన్యూ రికార్డుల్లో వక్ఫ్‌భూములుగా ఉన్నవాటిని మాజీ మంత్రి హయాంలో అక్రమంగా ఓఆర్‌సీలు జారీ చేయించి అక్రమ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతుందని, సికింద్లాపూర్ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలనివారు డిమాండ్ చేశారు.

**కొంతాన్‌పల్లి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి...**

మాజీ ఎమ్మెల్యేకు ప్రధాన అనుచరులుగా ఉన్న కొందరు బడా నాయకులు కొంతాన్‌పల్లి గ్రామంలో గత కాంగ్రెస్ ప్రభుత్వంలో దళితులకు కేటాయించిన అసైన్డ్ సీలింగ్ భూములను దళితులపై దౌర్జన్యం చేసి గుంజుకొని దర్జాగా తిరుగుతున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో కొంతాన్‌పల్లికి చెందిన రైతు శివయ్య అర్జీ కూడా సమర్పించారని వారు గుర్తు చేశారు. అక్రమంగా కబ్జాచేసిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు చెందేలా ఉత్తర్వులు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**ఏదుల్లాపూర్ వక్ఫ్ భూములపై విచారణ చేయాలి...**

ఏదుల్లాపూర్ గ్రామంలో వక్ఫ్ భూములను అక్రమంగా పట్టా చేయించుకున్నారని, తుర్కవానికుంట కిందగల వక్ఫ్‌భూములను గత అధికారపార్టీ నాయకులు కబ్జా చేశారని ఆరోపించారు. ఇది అన్యాయమని ప్రశ్నిస్తున్న రైతులను అక్రమదారులు బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఏదుల్లాపూర్ వక్ఫ్ భూములపై సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.

**సీఎం రేవంత్‌రెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తాం...**

పేదల సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో సీఎంను కలిసి మండలంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అక్రమంగా కబ్జాలు చేసిన భూములపై ఫిర్యాదుచేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అక్రమ రిజిస్ట్రేషన్లు, భూ అక్రమణలపై తప్పకుండా విచారణ జరిగేలా, పేద ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కల్లూరి పద్మయ్య, గోప్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న డిడబ్ల్యూఓ సంధ్యారాణి

## బాలల శిశు సంరక్షణపై శిక్షణ

**సంగారెడ్డి మున్సిపాలిటి, డిసెంబరు 14, ప్రభాతవార్త:**

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని 12 బాలల శిశు సంరక్షణ కేంద్రాల దత్తతపై గురువారం డిడబ్ల్యువో సంధ్యారాణి బాధితులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంగారెడ్డి పట్టణంలోని మహిళా ప్రాంగణంలో జిల్లాల బాలల పరిరక్షణ విభాగం, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, డబ్లుఏఐసి స్వచంద సంస్థల ఆధ్వర్యంలో బాలల శిశు సంరక్షణ కేంద్రాలకు దత్తతపై శిక్షణ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిడబ్ల్యువో సంధ్యారాణి మాట్లాడుతూ శిశు సంరక్షణ కేంద్రాలు వారి యొక్క పిల్లల యొక్క సంబంధిత వివరాలు అన్ని తమ దగ్గర ఉండేలా చూసుకోవాలన్నారు. దత్తతకు అర్హత కలిగిన పిల్లల వివరాలు దత్తత పోర్టల్‌ల అప్లోడ్ చేయాలని సూచించారు. జువెనైల్ జస్టిస్ యాక్ట్ 2021 ప్రకారం శిశు సంరక్షణ కేంద్రాలు నడపాలన్నారు. కార్యక్రమంలో సిడబ్ల్యుసి సభ్యులు విష్ణుమూర్తి, మెదక్ సిడబ్ల్యుసి సభ్యులు ఉప్పలయ్య, డిసిపిఒ రత్నం, కర్ణశీల, రామకృష్ణ, లింగం, నాగరాజు, శిశు రక్షణ కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీలకు ధర్మాజీపేట పాఠశాల విద్యార్థి అక్షయ ఎంపిక

**దుబ్బాక, డిసెంబర్ 14, ప్రభాతవార్త:**

జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన ధర్మాజీపేట పాఠశాల విద్యార్థిని కె.అక్షయ ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ నరేష్ తెలి పారు. అక్టోబర్ నెలలో మహబూబ్‌నగర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ యు17 వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరి చిందన్నారు. ధర్మాజిపేట పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కర్నాల అక్షయ జాతీయ స్థాయి పోటిలకు ఎంపిక కావడం జరిగిం దన్నారు. ఈ నెల 25 నుండి తమిళనాడులో జరిగే జాతీయ స్థాయి టోర్నీలో తెలంగాణ రాష్ట్రం తరపున అక్షయ పోటిలో పాల్గొననుంది. జాతీయ స్థాయికి ఎంపికైన అక్షయను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

## బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజరు వాహబ్

**హుస్నాబాద్, డిసెంబరు 14, ప్రభాతవార్త :** తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వినియోగదారులు తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ హుస్నాబాద్ బ్రాంచ్ మేనేజరు బాబా వాహెబ్ అన్నారు.గురువారం రోజున అక్కన్నపేట మండలంలోని రామవరం గ్రామంలో తమ ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యత, బ్యాంక్ సేవలపై ఎఫ్‌డిఎల్‌సి సమావేశం కళాకారుల బృధంతో కలసి నిర్వహించారు.ఈ సందర్భంగా కళాకారులు బ్యాంక్ సేవలపై పాఠలు పాడడంతో పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించి బ్యాంకు సేవలు, రుణాలు, ఇన్సూరెన్స్‌లాంటి వివరాలపై ఖాతా దారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్,పాలకవర్గంతో పాటు బ్యాంక్ సిబ్బంది,కళాకారులు,ఖాతా దారులు పాల్గొన్నారు.



ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## కడీలు ధ్వంసం చేసినవారిపై కేసు నమోదు చేస్తాం

### -ఎస్ఐ రవికాంత్‌రావు

**శివ్వంపేట, డిసెంబర్ 14 ప్రభాతవార్త:** ప్రభుత్వ భూమిలో ఉన్న కడీలను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు. ఆయన మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుండ్లపల్లి గ్రామ శివారులో సర్వే నెంబర్ 19 రెండవ సీరియల్‌లో శివ్వంపేట మండల విలేకరులకు ప్రభుత్వం ఇండ్ల స్థలాల పట్టాలు అందజేసింది. జర్నలిస్టులకు కేటాయించిన భూమిలో చుట్టూ కడీలు పాతుకోగా, మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన చెరుకు సత్తయ్య, చెరుకు మంగమ్మలు అక్రమంగా ప్రవేశించి పాతిన కడీలను ధ్వసం చేశారని ఆయన తెలిపారు. శివ్వంపేట తహశీల్దార్ శ్రీనివాస్‌చారి ఫిర్యాదు మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు. శివ్వంపేట జర్నలిస్టులకు కేటాయించిన భూమిలోకి ఎవరైనా ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## జీజీబీఎస్‌ఈ సిమెంట్ వినియోగాన్ని తగ్గించొచ్చు

**పటాన్‌చెరు, డిసెంబర్ 14,ప్రభాతవార్త:**

ఉక్కు పరిశ్రమలో ఉప ఉత్పత్తి అయిన గ్రౌండ్ గ్రాన్యులేటేడ్ బ్లాస్ట్ ఫర్నేస్ స్లాగ్ (జీజీబీఎస్)ను వినియోగించి సిమెంట్ వాడకాన్ని 25 నుంచి 70 శాతం వరకు తగ్గించవచ్చని జేఎస్ డబ్ల్యూ ప్రవేటు లిమిటేడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ షణ్ముక రెడ్డి చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మన్నికైన్, స్థిరమైన్, పర్యావరణ హిత కాంక్రీట్ కోసం స్లాగ్ బేస్ట్ ఉత్పత్తి వినియోగశాతంపై గురువారం ఆయన అతిధ్య ఉపన్యాసం చేశారు. ఓపీసీగా పిలిచే సాధారణ పోర్ట్లాండ్ సిమెంట్ వంటి సంప్రదాయ వనరుల లభ్యత క్షీణిస్తున్నందున భవిష్యత్తు తరాలకు ప్రత్యామ్నాయ సిమెంటేషన్ పదార్థాల అవసరం ఏర్పడిందన్నారు. సిమెంట్ ఉత్పత్తి కాలుష్యానికి దారితీస్తున్నందున,పర్యావరణ పరిరక్షణకు, నిర్మాణ అవసరాలను తీర్చడానికి ఫ్లైయాష్, మైక్రో సిలికా, వరిపొట్టు జీజీబీఎస్ వంటి ప్రత్యామ్నాయాల అన్వేషన మొదలైందన్నారు. జీజీబీఎస్‌ను ఉపయోగించడం ద్వారా థర్మల్ క్రాస్లు, ప్రాజెక్టు ఖర్చు వేడిన గణనీయంగా తగ్గించడమే గాక కాంక్రీటు నిర్మాణాల మన్నిక పెరిగి, దీర్ఘకాలం ధృడంగా ఉంటాయని షణ్ముకరెడ్డి చెప్పారు. మట్టి స్థిరీకరణలో కూడ జీజీబీఎస్ క్రియాశీల పాత్ర పోషిస్తుందని, తద్వారా జాతీయ రహదారులు, సబ్వేలలో దీని వినియోగం పెరిగిందన్నారు. గీతం ప్రాంగణంలో ఆయన మొక్కలను నాటి, ఆకుపచ్చ, స్వచ్ఛమైన పర్యావరణ ప్రాముఖ్యతను చాటి చెప్పారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ అఖిలేష్ చేపూరి అతిధిని సత్కరించి, గీతం-జేఎస్ డబ్ల్యూల మధ్య నిరంతర భాగస్వామ్యం కొనసాగాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ ఆర్కిటెక్చర్ విద్యార్థులు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

**హుస్నాబాద్, డిసెంబరు 14,ప్రభాతవార్త :** హుస్నాబాద్ పట్టణ కేంద్రానికి చెందిన 24 మంది కళ్యాణ లక్ష్మి లబ్దిదారులకు మంజూరైన చెక్కులను గురువారం రోజున మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి,కౌన్సిలర్లు కొంకటి నళినిరవి,చిత్తారి పద్మ,భూక్య సరోజన,దొడ్డి శ్రీనివాస్,బొజ్జ హరీష్,మాజీ ఎంపిపి ఆకుల వెంకన్న,కోఆప్షన్ సభ్యులు ఎండి అయూబ్,నాయకులు గడిపె మల్లేష్, పున్న సది,కోమటి సత్యనారాయణతో పాటు గిర్దవర్ రాజయ్య,జూనియర్ అసిసెంట్ మహ్మద్ కరీం,సీనియర్ అసిస్టెంట్ రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## 16న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

**పెద్దశంకరంపేట, డిసెంబర్ 14 ప్రభాతవార్త:** ఈ నెల 14న విశ్రాంత ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆ సంఘ మండల అధ్యక్షులు ఎస్.నర్సింలు తెలిపారు. 17న పెన్షనర్స్‌డేని పురస్కరించుకొని ఒకరోజు ముందుగా సమావేశాన్ని అనివార్య కారణాలవల్ల జరిపిస్తున్నామని, సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

**నంగునూర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి జాప అరుణాదేవి అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖలలోని పలు అంశాలపై అధికారులను సర్పంచ్‌లు అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో దేశిరెడ్డి మాట్లాడుతూ సిఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని నంగునూర్, నర్మెట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పదో తరగతి విద్యార్థులకు 8.30నుంచి 9.30వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. గట్లమల్యాల సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ ఎంఈవో 3 మండలాలకు ఇంచార్జి ఉండడంతో ఏ టైంకు ఎంఈవో ఎక్కడ ఉంటాడో తెలియడం లేదన్నారు, ఒక ఎంఈవోకే ఒకే మండలం ఇంచార్జి ఇవ్వాలన్నారు. ఒకే మండలానికి ఇంచార్జిగా ఉంటే ప్రతి పాఠశాలను పర్యవేక్షించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తారని తెలిపారు. అలాగే మన ఊరు మన బడి పథకం కింద నిర్మించిన పనుల బిల్లులు ఇంకా రాలేదని త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 26 మండలాలకు గానూ 9 మంది ఎంఈవోలు ఉన్నారని అందుకే ఇంచార్జిలుగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. గ్రామ ఉప సర్పంచ్‌లకు చెక్కు పవర్ ఇవ్వడంతో సర్పంచ్‌లు గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులు చేసినప్పటికీ చెక్కుల పై సంతకాలు చేయడంలో ఉప సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని సర్పంచ్ రమేష్ తెలిపారు. ప్రభుత్వం స్పందించి రాబోయే రోజుల్లో ఉప సర్పంచ్‌లకు చెక్ పవర్ ఇవ్వకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో వేణుగోపాల్, జడ్పీటిసి ఉమాదేవి, వైస్ ఎంపిపి రేణుక వేణుగోపాలచారి వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంపిపి జాప అరుణాదేవి

## 16న మహీంద్రా కంపెనీలో ఎన్నికలు

**జహీరాబాద్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** ఈ నెల 16వ తేదీన పట్టణ శివారులోని జాతీయ రహదారి పక్కనగల మహీంనరదా అండ్ మహీంద్రా ట్రాక్టర్ ప్లాంట్‌లో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో బిఎంఎస్ తరఫున ఆ సంఘం జాతీయ కార్మిక నాయకులు మల్లేశం, సిఐటియు తరఫున ప్రముఖ కార్మిక నాయకులు చుక్క రాములు, బిఆర్ఎస్ కార్మిక సంఘం తరఫున రాంబాబు బరిలో ఉన్నారు. కర్మాగారంలో 410 ఓట్లు ఉన్నాయి. గత సంవత్సరం జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ అనుబంధ సంస్థ కార్మిక సంఘం తరఫున రాంబాబు ఎన్నికయ్యారు.

## 16న గంగ్వార్‌లో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

**న్యాల్‌కల్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** ఈ నెల 16వ తేదీన మండలంలోని గంగ్వార్ గ్రామంలో శ్రీహనుమాన్ ఆలయ శిఖర, ధ్వజస్థంభ స్థాపన, శ్రీలక్ష్మీ నరసింహస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు, గ్రామస్థులు పేర్కొన్నారు. 16న ఉదయం 8 గంటలకు దీపారాధన, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, మాతృక పూజ, నంది శతవాహన, కంకణ బంధం పంచగవ్వ మేళనం, సర్వతోభద్ర స్థాపన, ముఖ్య కలశ స్థాపనం, ధాన్యాదివాసం, అరణి పూజ, అగ్ని స్థాపనం, వాస్తు మండల స్థాపనం, నవగ్రహ స్థాపనం, గుండ సమస్కారం, వాస్తు హోమం, నవగ్రహ హోమం, శాంతి హోమం, జలాధివాసం, మంగళహారతి, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. 17న ఉదయం 8 గంటలకు అవాహిత దేవతా పూజనం, శాంతి పారం స్థాపన, విధినేత్రమేలనం, శేయాధివాసం, పరియ హోమాలు, మంగళహారతి, భక్తులకు ప్రసాద వితరణ నిర్వహిస్తామన్నారు. 18న ఉదయం 8 గంటలకు అవాహిత దేవాతా పూజనం, యంత్ర స్థాపన, శిఖర స్థాపనం, లక్ష్మీ నరసింహస్వామి విగ్రహ ప్రతిష్టాపన, ప్రాణ ప్రతిష్టాంగ హోమం, స్విష్ణకృత హోమం, పూర్ణాహుతి, మంగళ హారతి, భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇదిలా ఉండగా ఆలయ ఆవరణలో ఈ నెల 11వ తారీఖు నుంచి 17వ తారీఖు వరకు (వారం రోజులు) సప్తహా భజన కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

## కేతకి ఆలయంలో అయ్యప్పస్వాముల మహాపడిపూజ

**ఝరాసంగం, డిసెంబరు 14, ప్రభాతవార్త:** మండలకేంద్రంలోని పార్వతీ దేవి సమేత శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయంలో గురువారం అయ్యప్ప స్వాముల మహాపడి పూజ నిర్వహించారు. అయ్యప్పస్వామిని పల్లకి సేవలో ఊరేగింపుగా ఆలయ పరిసరాలకు తీసుకువచ్చి రుద్రాభిషేకం నిర్వహించి భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి సంగన్న, జగదీశ్వర్‌స్వామి కిషన్‌స్వామి, సంగమేశ్వర్‌స్వామి, నరేష్‌స్వామి, సర్పంచ్ బొగ్గుల జగదీశ్వర్, మండల కాంగ్రెసన అధ్యక్షులు హన్మంతరావు పాటిల్, కాంగ్రెస్ యువ నాయకులు ఉదయ్ శంకర్ పాటిల్, నాయకులు సంగన్నముదిరాజ్, అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీవిద్యాధరి క్షేత్రంలో మూలా నక్షత్ర విశేష పూజలు

**వర్గల్, డిసెంబర్ 14 (ప్రభాతవార్త):** ప్రసిద్ధ వర్గల్ శ్రీవిద్యాధరి క్షేత్రంలో గురువారం మూలా నక్షత్ర విశేష పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, చండీహోమం, లక్ష నామార్చన, లక్ష పుష్పార్చన తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మొదటగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి మూల మహోత్సవానికి అంకురార్పణ చేశారు. మూల నక్షత్ర వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు అమ్మవారి నామ స్మరణతో మార్మోగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## విద్యార్థులు చక్కటి విద్యాబుద్దులు నేర్చుకోవాలి : డిఇవో

**దుబ్బాక, డిసెంబర్ 14, ప్రభాతవార్త:**



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

విద్యార్థులు క్రీడలతో పాటు చక్కటి విద్యాబుద్దులు నేర్చుకుని తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం దుబ్బాక మండలంలో తిమ్మాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో తిమ్మాపూర్ ఎర్త్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో విద్యార్థులకు క్రీడా వస్తు వులు, స్కూల్ బ్యాగులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా దుతూ సమాజ సేవలో ప్రత్యేకించి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఎర్త్ ఫౌండేషన్ సామాజిక మానవతా కార్యక్రమాలు చాలా బాగాఉన్నాయని ప్రశంసించారు. అనంతరం అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని నగరం, తాళ్లపల్లి, పోతారెడ్డిపేట, ఎనగుర్తితో పాటుగా దుబ్బాకలోని రఘోత్తంపల్లి, గోసాన్‌పల్లి, అచ్చుమాయిపల్లి, కమ్మర్‌పల్లి, టేకులతాండ, శిలాజినగర్, హబ్సీపూర్ గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల బోధన విధానాన్ని పరిశీలించారు. బోధనలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు సిలబస్‌కు అనుగునంగా ఎఫ్‌ఎల్‌ఎన్ డైరీలు, ఉన్నత డైరీలు రాసి మంచి బోధన చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభుదాస్, ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

## జనవరి 1న స్పటిక లింగానికి అభిషేకరం

**కొల్చారం, డిసెంబర్ 14 ప్రభాతవార్త:**

జనవరి 1వ తేదీన తొగుటలో స్వామివారి పీఠం నందు స్పటిక లింగానికి 1100 టీర్ల బాదం పాలచేత అభిషేకం కలదని కండక్టర్ జూలకంటి సంగమేశ్వర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ మహత్తర కార్యక్రమంలో పాల్గొనే భక్తులు లీటరు పాలు పోయడానికి రూ.200 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. ప్రత్యక్షంగా పాల్గొనే వారు బస్సు ద్వారా వెళ్లే అవకాశం ఉందని, శుక్రవారం సాయంత్రం వరకు అభిషేకం డబ్బులు తీసుకోబడునని తెలిపారు. అభిషేకంలో పాల్గొనే వారు తప్పనిసరిగా డబ్బులు ఇవ్వాలని లేదని, యధా శక్తిమేర డబ్బులు ఇవ్వొచ్చన్నారు. బస్సులో రావాలనుకున్న వారు ఛార్జీ నిమిత్తం చెల్లించాలని తెలిపారు. ఇతర వివరాలకు తనను గానీ, బొజ్జ వెంకటరమణను సంప్రదించవచ్చని వివరించారు.

## స్టేక్ హోల్డర్‌లకు 16న శిక్షణ

**సంగారెడ్డి మున్సిపాలిటి, డిసెంబరు 14, ప్రభాతవార్త:** ఈ నెల 16వ తేదీన పోలీసు అధికారులు, జువెనైల్, శిశు సంక్షేమ శాఖ అధికారులకు సంగారెడ్డిలోని స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్స్ సభ్యులకు, స్టేక్ హోల్డర్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె హన్మంతరావు తెలిపారు. 16న ఉదయం 10 గంటలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. పట్టణంలోని కోర్టు కాంప్లెక్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని హన్మంతరావు పేర్కొన్నారు.

## గల్ఫ్‌లో నందిగామ గ్రామ యువకుడు మృతి

**నిజాంపేట, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన పాపయ్యగారి బాబు(30) కువైట్‌లో ఏడు సంవత్సరాలుగా కోకోకోల కంపెనీలో ఉద్యోగం నిర్వహిస్తూ బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... నందిగామకు చెందిన పాపయ్యగారి బాబు కువైట్‌లో కోక కోలా కంపెనీలో ఉద్యోగంచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొద్దిరోజులుగా అతడికి ఆరోగ్యం సహకరించకపోవడం, ప్రమాదవశాత్తు బాత్రూంలో జారిపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడని కుటుంబ సభ్యులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు.అందరితో కలివిడిగా ఉండే బాబు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతిడికి భార్య,ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారు.